www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు


జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -138 మంగళవారం 1 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



## మెస్సీ శకం ముగిసింది

**అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన లెజెండ్**

ఫుట్‌బాల్ ప్రపంచంలో ఒక శకం ముగిసింది. అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం, కోట్లాది మంది అభిమానుల ఆరాధ్య దైవం లియోనెల్ మెస్సీ తన అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. రెండు దశాబ్దాల పాటు అర్జెంటీనా జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆ లెజెండ్, ఇకపై దేశం తరపున బరిలోకి దిగనని

మిగతా 2లో.

# పదేళ్లలో చేయలేనిది రెండేళ్లలో చేశాం

## ముసారాంబాగ్ హైలెవెల్ బ్రిడ్జి ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

- విపక్ష నేతగా కేసీఆర్ ఫెయిల్‌ఆయనకు, నాకు పోలిక ఏంటీ..
- వెయ్యిరోజుల్లో ఒక్కరోజైనా బయటకు వచ్చారా?
- కేసీఆర్ రాజీనామా చేయాలంటూ ఆరు రోజులపాటు ఆందోళనలు
- రెండేండ్లలోనే మూసారాంబాగ్ వంతెన పూర్తి
- వచ్చే ఏడాది రెండువేల పడకలతో ఉస్మానియా ఆస్పత్రి ప్రారంభం



**అంబర్‌పేట ఆగస్టు 31(ప్రజావినికిడి):**
బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. " కేసీఆర్‌కు.. నాకు పోలిక ఏంటి ?.. కేసీఆర్ సీఎం అయితే ఆయన కుటుంబ సభ్యులకు, బంధువులకు పదవులు కట్టబెట్టారు.. నేను సీఎం అయ్యాక ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పదవులు ఇచ్చాను" అని సీఎం అన్నారు.

మిగతా 2లో.



## యుద్ధానికి ముగింపు కావాలి

- ఉక్రెయిన్ యుద్ధంపై పుతిన్‌కు మోదీ స్పష్టమైన సందేశం
- అంతులేని యుద్ధం నుంచి యుద్ధానికి ముగింపు వైపు వెళ్లాలన్న మోదీ

**న్యూఢిల్లీ,ఆగస్టు 31(ప్రజావినికిడి):**
కిర్గిస్థాన్‌లోని బిష్కెక్ వేదికగా జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఉక్రెయిన్ యుద్ధంపై భారత్ తన దౌత్యపరమైన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది. "అంతులేని యుద్ధం నుంచి యుద్ధానికి స్వస్తి పలికే దిశగా అడుగులు వేయాలి" అని ఈ సందర్భంగా పుతిన్‌కు మోదీ సూచించారు.

మిగతా 2లో.

## తెలంగాణ ప్రాజెక్టులు ఎండిపోతున్నా ఏపీకి నీళ్లు ఇస్తున్నారు

- ఏపీలో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం.. రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఫైర్
- రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ముఖ్యమంత్రి రేవంత్ విఫలమయ్యారని ధ్వజం
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్

**హైదరాబాద్ ఆగస్టు 31(ప్రజావినికిడి):**
మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్ రావు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషించడం తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అని ఆయన విమర్శించారు.

మిగతా 2లో.



## 'పుట్టింటి నుంచే బయటకు పంపారు'

- సభలో బోరున విలపించిన కవిత
- బీఆర్ఎస్ సస్పెన్షన్‌పై భావోద్వేగానికి గురైన కవిత
- సభలో కన్నీటి పర్యంతమైన కవిత
- "కవిత సీఎం" అంటూ కార్యకర్తల నినాదాలు
- కొత్త పార్టీ పెట్టడానికి కారణాలు వివరించిన కవిత
- తీహార్ జైలుకు పంపిన వారికి ఎన్నికల్లో సమాధానమిస్తామని ప్రతిన

**హైదరాబాద్ ఆగస్టు 31((ప్రజావినికిడి):**
బీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేయడంపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ కోసం తనను జైలుకు పంపారని పెద్ద నాయకులే చెప్పారని గుర్తు చేశారు. ఆ తర్వాత అదే పార్టీ నుంచి తనను బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. "నాతో ఎందుకు ఇలా చేయాలి?" అంటూ కన్నీటి పర్యంతమయ్యారు.

మిగతా 2లో.




2లో.

## పెట్రోల్‌లో ఇథనాల్ శాతం చెప్పాల్సిందేనంటూ పిల్..

- విచారణకు నిరాకరించిన సుప్రీంకోర్టు ధర్మాసనం
- పిటిషనర్ సంబంధిత హైకోర్టును ఆశ్రయించాలని సూచన
- పాత వాహనాలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని పిటిషన్‌లో వాదన
- ఇలాంటి పిల్‌ను గతంలోనే తోసిపుచ్చామని తెలిపిన కేంద్రం



# వెలిగొండకు కృష్ణాజలాలు



## వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించిన సీఎం చంద్రబాబు.. నల్లమల గిరుల నుంచి పరుగులు పెట్టిన కృష్ణమ్మ



- పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- 30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న మూడు జిల్లాల ప్రజల కల సాకారం
- దోర్నాల వద్ద కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు, జలహారతి
- తొలి దశలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు
- ప్రారంభోత్సవానికి భారీగా హాజరైన రైతులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు

**ప్రకాశం/దోర్నాల ఆగస్టు 31(ప్రజావినికిడి):**
ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజల మూడు దశాబ్దాల కల సాకారమైంది. పశ్చిమ ప్రకాశంలోని కరవు పీడిత ప్రాంతాలకు జీవనాడిగా భావిస్తున్న పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రారంభించారు. దోర్నాల మండలం గంటవానిపల్లె వద్ద ప్రాజెక్టు సొరంగాల నుంచి ఉరకలేస్తూ వచ్చిన కృష్ణా జలాలకు ఆయన భక్తిశ్రద్ధలతో జలహారతి ఇచ్చి స్వాగతం పలికారు. ఈ చారిత్రక ఘట్టంతో ఆ ప్రాంత రైతులు, ప్రజల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఈ సందర్భంగా గంటవానిపల్లె ఫీడర్ కెనాల్ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, స్వయంగా నీళ్లలోకి దిగి కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, చీర సమర్పించి హారతి ఇచ్చారు. అంతకుముందు, జలహారతి ప్రదేశానికి విచ్చేసిన ముఖ్యమంత్రికి గిరిజన మహిళలు తమ సంప్రదాయ నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం

మిగతా 2లో.



# వెలిగొండకు కృష్ణాజలాలు

**మొదటిపేజీ తరువాయి**

పండితులు ముఖ్యమంత్రికి శ్రీశైలం మల్లికార్జున స్వామి చిత్రపటాన్ని అందించి ఆశీర్వదించారు.

నల్లమల కొండలను తొలుచుకుంటూ నిర్మించిన రెండు భారీ సొరంగాల నుంచి కృష్ణా జలాలు గంటవానిపల్లె ఆక్విడెక్టుకు చేరుకుని, అక్కడి నుంచి నల్లమల సాగర్ రిజర్వాయర్‌లోకి పరుగులు తీశాయి. ఈ దృశ్యాన్ని సభా ప్రాంగణం నుంచి వీక్షించిన మార్కాపురం రైతులు, మహిళలు పులకించిపోయారు. తమ ప్రాంతానికి కృష్ణమ్మ రావడంతో వారి ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, సుమారు 4 లక్షల మందికి తాగునీరు అందనుంది.

ఈ చారిత్రక కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు నిమ్మల రామానాయుడు, ఆనం రామనారాయణ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, డీబీవీ స్వామి, అనగాని సత్యప్రసాద్, పార్థసారధి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దశాబ్దాల నిరీక్షణకు కూటమి ప్రభుత్వం తెరదించిందని, ఇచ్చిన మాట ప్రకారం వెలిగొండను పూర్తి చేసిందని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## వెలిగొండ ప్రాజెక్టు జాతికి అంకితం చేశామని డ్రామా ఆడారు: చంద్రబాబు

ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల మూడు దశాబ్దాల కలను సాకారం చేస్తూ, కరవు నేలపై కృష్ణమ్మ పరుగులకు శ్రీకారం చుడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను జాతికి అంకితం చేశారు. నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేసి, ఈ చారిత్రక ఘట్టానికి నాంది పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, తన రాజకీయ జీవితంలో ఇదొక మరపురాని రోజని, మాట ఇచ్చి నిలబెట్టుకున్నానన్న సంతృప్తితో గుండె ఆనందంతో నిండిపోయిందని భావోద్వేగంగా అన్నారు.

1996 మార్చి 5న ముఖ్యమంత్రిగా ఇదే ప్రాజెక్టుకు తాను పునాదిరాయి వేసిన క్షణాలను గుర్తుచేసుకున్న చంద్రబాబు, సరిగ్గా 30 ఏళ్ల తర్వాత మళ్లీ ముఖ్యమంత్రిగా 2026 ఆగస్టు 31న దీనిని ప్రారంభించడం భగవంతుడు తనకు ఇచ్చిన అరుదైన అవకాశంగా అభివర్ణించారు. "పునాది వేశాను, ప్రాజెక్టు పూర్తి చేశాను, కృష్ణమ్మను తెచ్చాను, కరవును తరిమి కొడుతున్నాను. మాట ఇచ్చాను, నిలబెట్టుకున్నాను. ఈ ప్రాంత ప్రజల కళ్లలో ఆనందం చూస్తుంటే మాటలు పెగలడం లేదు. ఇది నా అదృష్టం" అని చంద్రబాబు అన్నారు.

ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు, ఊళ్లు త్యాగం చేసిన 11 గ్రామాల నిర్వాసిత ప్రజలకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని, వారి త్యాగం లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతుందని కొనియాడారు. వెలిగొండ అంటే కరవుపై గెలుపు, రైతు భవిష్యత్తుకు నమ్మకం, ఫ్లోరైడ్ కష్టాలకు ముగింపు అని ఆయన అభివర్ణించారు.

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వెలిగొండ ప్రాజెక్టుకు గ్రహణం పట్టిందని, 2024 ఎన్నికలతో ఆ గ్రహణం వీడిందని చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత ప్రభుత్వం కేవలం 2.77 శాతం పనులు చేసి, విలువైన కాలాన్ని గాలికొదిలేసింది. ఎన్నికలకు నెల ముందు రూ.4,500 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టి, ప్రాజెక్టును జాతికి అంకితం చేశామని డ్రామా ఆడింది. ఇది సిగ్గులేనితనం కాదా? కరవు ప్రాంత రైతులతో ఆడుకోవడానికి మానవత్వం ఉందా?" అని ఆయన ప్రశ్నించారు.

సొరంగంలో ఇరుక్కుపోయిన టన్నెల్ బోరింగ్ మిషన్‌ను తాను స్వయంగా రంగంలోకి దిగి తొలగించానని చంద్రబాబు వెల్లడించారు. ఆ తర్వాత, ఇంకా పనులు మిగిలి ఉండగానే సొరంగాలు మొత్తం తిరిగివచ్చానని, ప్రాజెక్టు సిద్ధంగా ఉందని చెప్పిన ఆనాటి ఫేక్ ముఖ్యమంత్రిని ఏమనాలో మార్కాపురం ప్రజలే ఆలోచించాలని అన్నారు. తన హయాంలోనే ప్రాజెక్టుకు 50 శాతానికి పైగా నిధులు ఖర్చు చేశామని, వాస్తవాలు చరిత్రలో నిలిచిపోతాయని, ఫేక్ మాటలతో ప్రజలను ఎవరూ మోసం చేయలేరని చంద్రబాబు స్పష్టం చేశారు.

### వాళ్లు కూడా అంతే సంతోషంగా ఉండాలి

ప్రాజెక్టుతో లబ్ధి పొందే రైతులు ఎంత సంతోషంగా ఉంటారో, త్యాగాలు చేసిన నిర్వాసితులు కూడా అంతే సంతోషంగా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని ముఖ్యమంత్రి అన్నారు. నిర్వాసితులకు ఇప్పటికే రూ.768 కోట్లు అందించామని, త్వరలోనే మిగిలిన రూ.165 కోట్లు, రూ.169 కోట్లు కూడా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కటాఫ్ డేట్ సమస్యతో నష్టపోయిన వారికి అదనంగా రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. ఏ ఒక్క నిర్వాసితుడు ఇబ్బంది పడకుండా ఆదుకోవడం తమ ప్రభుత్వ సిద్ధాంతమని ఆయన పునరుద్ఘాటించారు.

ఎల్ నినో ప్రభావంతో ఎగువన జలాశయాల్లో నీళ్లు లేకపోయినా, కనీసం తాగునీటి అవసరాల కోసం 10.7 టీఎంసీల నీటిని నల్లమల సాగర్‌కు తీసుకొస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఈ నీటితో మొదటి విడతలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందుతుందని వివరించారు. ప్రాజెక్టు పూర్తిగా పూర్తయితే ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 30 మండలాల్లో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఈ ప్రాజెక్టుతో పశ్చిమ ప్రకాశం తలరాత మారుతుందని, ఫ్లోరైడ్ అనే పదం గత చరిత్రగా మిగిలిపోతుందని భరోసా ఇచ్చారు.

### అది మోదీతోనే సాధ్యం

దేశంలో నీటి సమస్యకు నదుల అనుసంధానమే ఏకైక పరిష్కారమని, అది ప్రధాని నరేంద్ర మోదీతోనే సాధ్యమని చంద్రబాబు అన్నారు. 2027 మార్చి నాటికి



పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని, వచ్చే కృష్ణా పుష్కరాలను మార్కాపురంలోనూ వైభవంగా జరుపుకోబోతున్నామని ప్రకటించారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానంతో దక్షిణ భారతదేశంలోని నీటి యుద్ధాలకు ముగింపు పలకవచ్చని, ఆ దిశగా కేంద్రంతో చర్చలు సాగుతున్నాయని తెలిపారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పశ్చిమ ప్రకాశం ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చామని, ఆ మాట నిలబెట్టుకున్నామని స్పష్టం చేశారు. మార్కాపురాన్ని రూ.లక్ష కోట్ల గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌లో భాగం చేశామని, 2028 నాటికి వెలిగొండ రెండో దశను కూడా పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సభకు ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు.

# పదేళ్లలో చేయలేనిది రెండేళ్లలో చేశాం

**మొదటిపేజీ తరువాయి**

దేశంలోనే ప్రధాన ప్రతిపక్ష నేత వైఫల్యం చెందిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని వ్యాఖ్యానించారు. వెయ్యిరోజుల్లో ఒక్కరోజైనా ఆయన జనం కోసం బయటకు రాలేదని తెలిపారు. 'పదేండ్లలో మీరు ఏం చేశారో.. రెండున్నరేండ్లలో మేం ఏం చేశామో అసెంబ్లీలో చర్చకు సిద్ధం' అని సీఎం సవాల్ విసిరారు. ప్రజల కోసం పనిచేయని కేసీఆర్.. పదవికి రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని అంబర్‌పేట, ముసారాంబాగ్ హై లెవెల్ బ్రిడ్జిని మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు మాజీ ఎంపీ వి. హనుమంతరావు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌తో కలిసి సీఎం ప్రారంభించారు. అనంతరం అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. హైదరాబాద్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం తెలంగాణను మూడు ప్రాంతాలుగా విభజించి ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో



నివసిస్తున్న ప్రజలు వరదల సమయంలో తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో మూసారాంబాగ్ వంతెన ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేండ్లలోనే వంతెన నిర్మాణాన్ని పూర్తి చేశామని తెలిపారు. అంబర్‌పేటలో గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించలేదని ఆరోపించారు. పేదల కష్టాలు తమకు తెలుసని, అందుకే వారికి ఇండ్లు నిర్మించి ఇస్తున్నామని చెప్పారు. బతుకమ్మకుంటను ఆక్రమణల నుంచి విముక్తి చేసి ఆడబిడ్డలకు బహుమతిగా ఇచ్చామని తెలిపారు. కానీ మళ్లీ బతుకమ్మకుంట కబ్జాకు యత్నిస్తున్నారంటూ తెలిపారు. చెరువుల్లో ఆక్రమణలను తొలగిస్తున్నాం తప్ప విల్లాలు, ఫామ్‌హౌస్‌లు నిర్మించడం లేదని స్పష్టం చేశారు. హైడ్రాపైనా, తనపైనా కొంతమంది పనిగట్టుకుని ఆరోపణలు చేస్తున్నారన్నారు. కబ్జాలు ఎవరు చేస్తున్నారో ప్రజలు ఆలోచించాలని తెలిపారు.

ప్రజాపాలన ఏర్పడి 1000 రోజులు పూర్తయ్యాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. తమ ప్రభుత్వం విఫలమైందని కొందరు ఆరోపిస్తున్నారనీ, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చూసి ఆశ్చర్యపోయామని అన్నారు. ధనిక రాష్ట్రంగా అప్పగించిన తెలంగాణను గత ప్రభుత్వం అప్పులకుప్పగా మార్చిందని ఆరోపించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శించారు. ప్రస్తుతం నెలకు సుమారు రూ.7,500 కోట్ల మేర అసలు, వడ్డీ చెల్లిస్తున్నామని తెలిపారు. గతంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందేవి కావని, తమ ప్రభుత్వం ఒకటో తేదీన వారికి వేతనాలు చెల్లిస్తోందన్నారు. 100 రోజుల్లో రూ.6 వేల కోట్ల రిటైర్మెం ట్ బెనిఫిట్స్ విడుదల చేశామన్నారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఉద్యోగ నియామకాలు చేపట్టలేదని, తమ ప్రభుత్వం రెండేండ్లలో 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిందని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం.. ఆర్టీసీకి రూ.11 వేల కోట్లు కట్టామన్నారు. రైతుల కోసం రూ.లక్షా 70 వేల కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. తాము అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలు ఆలోచించాలని కోరారు. 3 కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తున్నామని చెప్పారు. కేసీఆర్ ఏనాడైనా రేషన్ కార్డుల గురించి ఆలోచన చేశారా అని ప్రశ్నించారు.

# యుద్ధానికి ముగింపు కావాలి

**మొదటిపేజీ తరువాయి**

ఈ యుద్ధం వీలైనంత త్వరగా ముగియాలని యావత్ మానవాళి కోరుకుంటోందని ప్రధాని పేర్కొన్నారు. ఈ సంక్షోభ పరిష్కారానికి ఉద్దేశించిన ప్రతి శాంతియుత ప్రయత్నానికి భారత్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. "ఏ సమస్యనైనా శాంతియుత మార్గాల్లోనే పరిష్కరించుకోవాలన్నదే భారత్ నిశ్చితాభిప్రాయం. ఇది సకల మానవాళి శ్రేయస్సుకు అత్యవసరం. యుద్ధం కొనసాగే ప్రతి రోజూ మానవ ప్రగతిని వెనక్కి నెడుతుంది. కాబట్టి దీనికి తక్షణమే ముగింపు పలకాలి" అని మోదీ వివరించారు. గాంధీ, బుద్ధుడు నడయాడిన భారత గడ్డ ఎల్లప్పుడూ శాంతి మార్గాన్నే బోధిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. 2022లో జరిగిన ఎస్‌సీఓ సదస్సులో "ఇది యుద్ధాల యుగం కాదు" అని పుతిన్‌తో మోదీ చేసిన చారిత్రాత్మక వ్యాఖ్యలకు కొనసాగింపుగానే తాజా సందేశం సాగింది. అటు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తోనూ, ఇటు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతోనూ జరిపిన ప్రతి సంభాషణలోనూ చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కారం సాధ్యమని భారత్ నొక్కి చెబుతూ వస్తోంది.

### కిర్గిస్థాన్‌లో ఇరాన్ అధ్యక్షుడితో మోదీ భేటీ

ప్రధాని మోదీ సోమవారం ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో భేటీ అయ్యారు. కిర్గిస్తాన్‌లో జరుగుతున్న షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్ సమావేశంలో ఆ ఇద్దరు కలుసుకున్నారు. కిర్గిస్తాన్ రాజధాని బిష్కేక్‌లో ఆ మీటింగ్ జరిగింది. ఫిబ్రవరిలో ప్రారంభమైన ఇరాన్ వార్ తర్వాత తొలిసారి ఈ ఇద్దరు నేతలు కలుసుకున్నారు. ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా, ఇజ్రాయెల్ దళాలు అటాక్ చేసిన విషయం తెలిసిందే. ఇదే సమావేశాల్లో ఆర్మేనియా ప్రధాని నికోల్ పషిన్యాన్‌తోనూ ప్రధాని మోదీ భేటీ అయ్యారు. పెజెష్కియాన్, మోదీ మధ్య ఎటువంటి సంభాషణ జరిగిందో ఇంకా స్పష్టంగా తెలియదు. కానీ హోర్ముజ్ జలసంధి అంశంలో చర్చ జరిగి ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. పెజెష్కియాన్, మోదీ మధ్య జరిగిన భేటీ గురించి భారత్‌లో ఇరాన్ ఎంబసీ తన సోషల్ మీడియాలో పోస్టు చేసింది. అయితే అమెరికాకు వ్యతిరేకంగా శక్తులను ఏకీకరించేందుకు పెజెష్కియాన్ ఎస్‌సీవో మీటింగ్‌లో పాల్గొంటున్నారు.

## తెలంగాణ ప్రాజెక్టులు ఎండిపోతున్నా ఏపీకి నీళ్లు ఇస్తున్నారు

**మొదటిపేజీ తరువాయి**

ఈ మేరకు సోమవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు. వరద నీరు లేకున్నా, ఎటువంటి కేటాయింపులు లేకుండానే కృష్ణా బేసిన్ వెలుపలి ప్రాంతాలకు ఏపీ ప్రభుత్వం వెలిగొండ ద్వారా నీటిని యథేచ్ఛగా తరలిస్తోందని హరీశ్ రావు ఆక్షేపించారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో సాగునీటి ఎద్దడి ఏర్పడి భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి ప్రాజెక్టులు ఎండిపోతుంటే, ఏపీ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలించుకుపోవడం తెలంగాణ రైతాంగ హక్కులపై దాడి చేయడమేనని మండిపడ్డారు. ఇప్పటికే మల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు ద్వారా తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలించుకుపోయిందని, ఇప్పుడు వెలిగొండ వంతు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ ప్రాంత ఆయకట్టుకు నీరందించడంలో విఫలమైన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఏపీ చర్యలపై ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు. ఇది ఏపీకి పరోక్షంగా సహకరించడమేనని ఆరోపించారు. నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సైతం నిర్లిప్తంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ వివాదంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తక్షణమే జోక్యం చేసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కేఆర్ఎంబీపై ఒత్తిడి తీసుకువచ్చి, తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపేలా చూడాలని, తద్వారా ఆయకట్టుకు నీరందించాలని కోరారు.

# 'పుట్టింటి నుంచే బయటకు పంపారు'

నిజామాబాద్‌లో నిర్వహించిన తన పార్టీ పాంచజన్య సభలో కవిత మాట్లాడారు. సొంతంగా పార్టీ పెట్టిన తర్వాత తొలిసారి నిజామాబాద్ గడ్డపై అడుగుపెట్టిన ఆమె.. బీఆర్ఎస్ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. కన్నీళ్లు పెట్టుకున్నంత మాత్రాన తాను పిరికిదాన్ని కాదన్నారు. అవి బాధ, ఆవేశంతో వచ్చిన కన్నీళ్లని చెప్పారు. కవిత బోరున విలపించడంతో సభలో ఉన్న మహిళలు సైతం కంటతడి పెట్టుకున్నారు. కార్యకర్తలు "కవిత సీఎం.. సీఎం" అంటూ నినాదాలతో ప్రాంగణాన్ని హోరెత్తించారు.

తెలంగాణలో ఇంకా ఎన్నో మంచి పనులు చేయాల్సి ఉందని కవిత చెప్పారు. అందుకే కొత్త పార్టీ పెట్టానన్నారు. తనను పుట్టింటి నుంచి బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఆర్నెల్లు జైలులో ఉండి వచ్చినప్పుడు పుట్టినిల్లు ఆదరించలేదన్నారు. అదే సమయంలో తన అత్తమామలు ఒక్క మాట కూడా అనకుండా కడుపులో పెట్టుకుని కన్నబిడ్డలా చూసుకున్నారని చెప్పారు. ఏ తప్పూ చేయని తనను తీహార్ జైలుకు పంపిన వారికి ఎన్నికల్లో గెలుపుతో సమాధానం చెబుతానన్నారు. రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కొత్త రాజకీయ శక్తి అవసరమని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో నిజామాబాద్ జిల్లాలో ఒక్క ఎకరానికైనా నీళ్లు వచ్చాయా? అని ప్రశ్నించారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన వారిని నిలదీసేందుకు బీఆర్ఎస్ ఎందుకు వెనక్కి తగ్గుతోందని ప్రశ్నించారు. తాను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డనని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని ప్రజలను కోరారు.

# పెట్రోల్‌లో ఇథనాల్ శాతం చెప్పాల్సిందేనంటూ పిల్..

**విచారణకు నిరాకరించిన సుప్రీంకోర్టు ధర్మాసనం**

పెట్రోల్ బంకుల్లో విక్రయించే ఇంధనంలో ఇథనాల్ శాతం ఎంతో తప్పనిసరిగా వెల్లడించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ అంశంపై సంబంధిత హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సోమవారం ధర్మాసనం సూచించింది. న్యాయవాది ఎన్.కె. గోస్వామి సుప్రీంకోర్టులో ఈ పిల్ దాఖలు చేశారు. పెట్రోల్ నాజిల్లపై, జారీ చేసే రశీదులపై ఇథనాల్ శాతాన్ని స్పష్టంగా ముద్రించాలని ఆయన కోరారు. ఇథనాల్ కలిపిన పెట్రోల్‌కు ఏయే వాహనాలు అనుకూలంగా ఉంటాయో తెలిపే అధికారిక డేటాబేస్‌ను ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. ముఖ్యంగా 2023 కంటే ముందు తయారైన పాత వాహనాలకు ఇ20 (20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్) వాడకం వల్ల తలెత్తే సమస్యల నుంచి రక్షణ కల్పించాలని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్యాక్ చేసిన ఆహార పదార్థాలపై వాటి వివరాలను వెల్లడించినట్లే, తాము కొనుగోలు చేసే ఇంధనం గురించి తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని ఆయన వాదించారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ ఎం.ఎం. సుందరేష్, జస్టిస్ ప్రసన్న బి. వరాళేలతో కూడిన ధర్మాసనం విచారించింది. కేంద్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి ఈ పిటిషన్‌ను వ్యతిరేకించారు. ఇది ఒక 'ప్రాక్సీ పిటిషన్' అని, ఇదే తరహా వ్యాజ్యాన్ని 2025 సెప్టెంబర్‌లోనే సుప్రీంకోర్టు కొట్టివేసిందని ఆయన గుర్తుచేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, ఈ పిటిషన్‌పై తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేస్తూ, పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించవచ్చని పేర్కొంది. ఇ20 పెట్రోల్ వల్ల వాహనాల యాక్సిలరేషన్ మెరుగుపడటంతో పాటు ఉద్గారాలు తగ్గుతాయని, దీనివల్ల రైతులకు మేలు జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం చెబుతున్న విషయం తెలిసిందే.

# మెస్సీ శకం ముగిసింది.. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన లెజెండ్

**మొదటిపేజీ తరువాయి**

సోమవారం (ఆగస్టు 31) సంచలన ప్రకటన చేశాడు. ఈ మేరకు తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఒక భావోద్వేగ లేఖను పోస్ట్ చేశాడు. 2026 ప్రపంచకప్ ఫైనల్‌లో స్పెయిన్ చేతిలో ఓటమి పాలైనప్పటి నుంచే రిటైర్మెంట్ ఆలోచనలో ఉన్నానని, తన తండ్రి మరణం ఆ నిర్ణయాన్ని మరింత బలపరిచిందని మెస్సీ ఆ లేఖలో పేర్కొన్నాడు. మెస్సీ వీడ్కోలు వార్త ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫుట్‌బాల్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. "ఫైనల్ ముగిసినప్పటి నుంచి సుదీర్ఘంగా ఆలోచించిన తర్వాత, నేను జాతీయ జట్టు నుంచి రిటైర్ అవుతున్నానని అందరికీ తెలియజేయాలనుకుంటున్నాను" అని మెస్సీ తన ప్రకటనను ప్రారంభించాడు. తన కెరీర్ ఆద్యంతం అర్జెంటీనా అభిమానులతో, జాతీయ జట్టుతో పెనవేసుకున్న అనుబంధం కారణంగా ఈ నిర్ణయం తీసుకోవడం చాలా బాధాకరంగా ఉందని తెలిపాడు. "ఈ నిర్ణయం నన్ను తీవ్రంగా గాయపరిచింది, ఇప్పటికీ బాధిస్తూనే ఉంది. కానీ, ఇదే సరైన సమయమని నేను అర్థం చేసుకున్నాను. నా దేశం కోసం నేను ఎప్పుడూ సర్వస్వం ఇచ్చానని ప్రమాణం చేస్తున్నాను. కేవలం గెలిచిన మ్యాచ్ లలోనే కాదు, అంతకుముందు కూడా ఈ జెర్సీ కోసం నేను ఎప్పుడూ పోరాడాను, నా సర్వశక్తులు ఒడ్డాను. ఫుట్‌బాల్ ద్వారా మీకు ఆనందాన్ని పంచడానికి, అర్జెంటీనా పౌరుడిగా మీరు గర్వపడేలా చేయడానికి ప్రయత్నించాను" అని భావోద్వేగంగా రాసుకొచ్చాడు. తన రిటైర్మెంట్ నిర్ణయం వెనుక ఉన్న బలమైన కారణాలను మెస్సీ స్పష్టంగా వివరించాడు. జూలైలో జరిగిన 2026 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో స్పెయిన్‌పై అర్జెంటీనా ఓటమి పాలవడం తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపాడు. ఆ ఓటమి తర్వాత రెండు రోజులకే, అంటే జూలై 21నే తాను ఈ వీడ్కోలు లేఖను రాసుకున్నట్లు వెల్లడించాడు. అయితే, ఇటీవల మా నాన్న మరణం తర్వాత, ఇక కొనసాగలేనన్న నమ్మకం బలపడింది" అని పేర్కొన్నాడు. మెస్సీకి తండ్రి జార్జ్ మెస్సీనే ఏజెంట్‌గా వ్యవహరించారు. సుదీర్ఘ అనారోగ్యంతో ఆగస్టు 8న మరణించిన విషయం తెలిసిందే. కాలం గడిచిపోవడం, కొత్త తరం క్రీడాకారులు జట్టులోకి రావడం కూడా తన నిర్ణయానికి ఒక కారణమని మెస్సీ వివరించాడు. "నాకు మిగిలింది తక్కువ సమయమే. నా జీవితంలో కొన్ని అధ్యాయాలు ముగింపు దశకు వస్తున్నాయి. అందులో ఇది ఒకటి. ఇది నన్ను చాలా బాధిస్తోంది. నేను జాతీయ జట్టులో భాగమవ్వడాన్ని ప్రేమించాను, ప్రేమిస్తున్నాను, ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటాను. నా దగ్గర ఉన్నదంతా ఇచ్చేశాను. ఇక ఇవ్వడానికి ఏమీ మిగల్లేదు. అంతేకాకుండా, అద్భుతమైన యువ క్రీడాకారులు వస్తున్నారు. వారికి అవకాశం దక్కాలి" అని పేర్కొన్నాడు.

రెండు దశాబ్దాల తన అంతర్జాతీయ ప్రయాణంలో తనకు అండగా నిలిచిన అభిమానులకు మెస్సీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపాడు. "గడిచిన 20 ఏళ్లుగా మీరు చూపించిన ప్రేమకు, మద్దతుకు ధన్యవాదాలు. స్టేడియం లోపలి నుంచి మీ కేరింతలను నేను చాలా మిస్ అవుతాను. ఇకపై నేను కూడా మీలో ఒకడిగా, మంచి చెడు సమయాల్లో, ముఖ్యంగా కష్టకాలంలో బయటి నుంచి జట్టుకు మద్దతు ఇస్తాను" అని తెలిపాడు. తన ఈ సుదీర్ఘ ప్రయాణంలో తోడుగా నిలిచిన కుటుంబ సభ్యులకు, కోచ్‌లకు, సహచర ఆటగాళ్లకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపాడు. "ఈ అందమైన, అదే సమయంలో కఠినమైన ప్రయాణంలో నాతో పాటు ఉన్న నా కుటుంబానికి ధన్యవాదాలు. ఈ ప్రయాణంలో భాగమైన ప్రతి కోచ్, సహచరుడు, అధికారికి నా కృతజ్ఞతలు. ఎప్పటికీ మర్చిపోలేని జ్ఞాపకాలను, క్షణాలను నాతో పాటు తీసుకువెళుతున్నాను" అని పేర్కొన్నాడు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
మంగళవారం 1 సెప్టెంబర్ 2026


## సీఐ నుంచి డిసి వరకు సత్యనారాయణ సేవలు అమోఘం

### గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ ఏ. శ్రీనివాసరెడ్డి




**నాంపల్లి, (ప్రజావినికిడి):** కరీంనగర్ జిల్లాలో సిఐగా తొలి పోస్టింగ్ లో డిటిఫ్ టీం లో కానిస్టేబుల్ గా పరిచయమైన సత్యనారాయణ, హైదరాబాద్ గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ గా కొనసాగుతున్న కాలంలో ఆయన హెడ్ కానిస్టేబుల్ గా రిటైర్డ్ కావడం జరిగిందని గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ ఏ శ్రీనివాసరెడ్డి అన్నారు.సోమవారం సికింద్రాబాద్ డిటిఎఫ్ లో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న సత్యనారాయణ పదవీ విరమణ కార్యక్రమం సాయంత్రం ఆప్కారి భవన్లోని సమావేశ మందిరములో జరిగింది. కానిస్టేబుల్ గా ఆయన సేవలను కరీంనగర్ జిల్లాలో చూసానని హెడ్ కానిస్టేబుల్ గా ఆయన సేవలను గ్రేటర్ హైదరాబాద్ లో చూశానని డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో డిసి తో పాటు సికింద్రాబాద్, హైదరాబాద్ ఈ ఎస్ లు జీవన్ కిరణ్,విజయ భాస్కర్ గౌడ్, ఏఎస్ శ్రీనివాసరావు డిటిఎఫ్ సిఐ సౌజన్య కుటుంబ సభ్యులు స్నేహితులు పలువురు పాల్గొన్నారు.

## శ్రీదుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్, ఆగస్టు 31, (ప్రజావినికిడి):**
సరూర్ నగర్ లింగోజిగూడ తపోవన్ కాలనీలోని శ్రీ దుర్గామాత ఆలయంలో శివ పంఛాయతన పంచముఖ ఆంజనేయ స్వామి, గంగపతి, నాగమాత, దేవాలయ శిఖర ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్బీనగర్ నియోజక వర్గం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి,మిర్ద భాస్కర్ గంగపుత్ర విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గామాత దేవాలయం కమిటి చైర్మెన్ కె. దీపంజి,వైస్ చైర్మన్ లు ఎం కృష్ణ,కె.నరేందర్ రెడ్డి,జనరల్ సెక్రటరీ ఎ ఐలయ్య యాదవ్, జాయింట్ సెక్రటరీ సబ్దిన్ రావ్, ట్రెజరర్ రాజేందర్,విశిష్ట అతిథి ఎం భాస్కర గంగపుత్ర,బిఆర్ఎస్ నాయకులు ఆర్ ప్రకాష్, ప్రసాద్, దయానంద్, వరప్రసాద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ కార్యాలయంపై దాడి ప్రజాస్వామ్యానికి మచ్చ

**నల్లగొండ, ఆగష్టు 31, (ప్రజావినికిడి):**



తెలంగాణ భారతీయ జనతా పార్టీ కార్యాలయంపై అదే విదంగా నల్గొండ జిల్లా బీజేపీ కార్యాలయం పైన నాగం వర్షిత్ రెడ్డి జిల్లా అధ్యక్షులు ఇంటి పైన కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ ఓబీసీ మోర్చా అధికార ప్రతినిది నారోజు కుమారస్వామి అన్నారు.ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు సహజమని, అయితే ఆ భిన్నాభిప్రాయాలను చర్చలు, ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారా వ్యక్తం చేయాలి తప్ప దాడులు, విధ్వంసాలకు పాల్పడటం ఎంతమాత్రం సమర్థనీయం కాదన్నారు.రాజకీయంగా ఎదుర్కోలేక భౌతిక దాడులకు దిగడం కాంగ్రెస్ పార్టీ అసహనానికి నిదర్శనం. అధికారంలో ఉన్న పార్టీ కార్యకర్తలే ఇలాంటి చర్యలకు పాల్పడితే సామాన్య ప్రజలకు ఎలాంటి సందేశం వెళు_ంది?"అని ప్రశ్నించారు.తెలంగాణ గడ్డపై ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉందన్నారు. బీజేపీ కార్యాలయంపై జరిగిన దాడికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.దాడులు, బెదిరింపులతో బీజేపీ నాయకులు, కార్యకర్తలను భయపెట్టడం సాధ్యం కాదు. ప్రజాస్వామ్య విలువలు,ప్రజల హక్కుల పరిరక్షణ కోసం బీజేపీ తన పోరాటాన్ని మరింత బలంగా కొనసాగిస్తుంది అని నారోజు కుమారస్వామి బీజేపీ ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి స్పష్టం చేశారు.

## ఉపాధి పనుల మొదటి గ్రామ సభ




**వాజేడు, సెప్టెంబర్ 1,(ప్రజావినికిడి):**
గుమ్మడిదొడ్డి గ్రామపంచాయతీ నందు వికసిత భారత్ గ్యారంటీ ఫర్ రాజ్ గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ పథకంలో రాబోయే ఆర్థిక సంవత్సరముకు సంబంధించి కొత్త పనుల ఎంపిక ప్రక్రియలో భాగంగా మొదటి గ్రామ సభను సర్పంచ్ బోదెబోయిన భరత్ కుమార్ అధ్యక్షతన నిర్వహించటం జరిగినది అనుమతించబడిన 318 రకాల పనుల వివరాలను గ్రామసభనందు చదివి వినిపించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏపీవో సత్యేందర్,గ్రామ పంచాయతీ సెక్రటరీ ఫీల్డ్ అసిస్టెంట్ పంచాయతీ పాలకవర్గ సభ్యులు గ్రామస్తులు హాజరు కావడం జరిగింది

# ఉపాధ్యాయుల సేవలు సమాజానికి చిరస్మరణీయం

### మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి

### పాపిరెడ్డిగూడ హైస్కూల్ హెచ్ఎం కోప్పునూరి శ్రీశైలం పదవీ విరమణ సందర్భంగా ఘన సన్మానం



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాద్ నగర్ నియోజకవర్గం లోని పాపిరెడ్డిగూడ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కోప్పునూరి శ్రీశైలం పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి హాజరై పదవీ విరమణ చేస్తున్న హెచ్ఎం శ్రీశైలంను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు.ఒక ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా శ్రీశైలం అందించిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండి పోతుందని అన్నారు.

పదవీ విరమణ అనేది సేవలకు ముగింపు కాదని, జీవితంలో మరో కొత్త అధ్యాయానికి ప్రారంభమని పేర్కొంటూ, శ్రీశైలం భవిష్యత్తులో మరింత సంతోషంగా, ఆయురారోగ్యాలతో జీవించాలని తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ శశిరేఖ యాదయ్య, మహిళా అధ్యక్షురాలు రాణి,వార్డు సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొని పదవీ విరమణ పొందుతున్న ప్రధానోపాధ్యాయులు కోప్పునూరి శ్రీశైలంకు శు భాకాంక్షలు తెలిపారు.

# ప్రధానోపాధ్యాయులు కొప్పునూరి శ్రీశైలం పదవీ విరమణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాద్నగర్ పట్టణంలోని కేకేఆర్ ఫంక్షన్ హాల్లో పాపిరెడ్డిగూడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొప్పునూరి శ్రీశైలం పదవీ విరమణ మహోత్సవ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది.ఈ వేడుకకు హాజరైన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పదవి విరమణ అవుతున్న శ్రీశైలం విద్యా రంగానికి అలాగే విద్యార్థుల అభ్యున్నతికి చేసిన సుదీర్ఘ సేవలను ప్రత్యేకంగా కొనియాడారు.సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనదని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.అనంతరం శ్రీశైలం ను శాలువాతో ఘనంగా సత్కరించి,వారి శేష జీవితం సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మెన్ నరేందర్,కౌన్సిలర్ బీఎస్ సుధీర్,మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణు వర్ధన్ రెడ్డి,తోటి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలనలో ఆడబిడ్డలకు రక్షణ లేదు

### ఆదివాసి ఆడబిడ్డకు న్యాయం జరిగేంతవరకు పోరాడుదాం..

### గొండ్వానా సంక్షేమ పరిషత్..

### నిందితులను ఉరి తీయాలి..

**వాజేడు సెప్టెంబర్ 1,(ప్రజావినికిడి):**
ప్రజాపాలనలో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో ఆదివాసీ మహిళలుకు రక్షణన లెకుండా పోతుంది మన దేశం 79 వసంతాలు పూర్తి చేసుకున్న రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ప్రజాపాలన పేరు చెప్పుకొని పబ్బం గడుపుతుంది తప్ప,ఆదివాసి మహిళలకు రక్షణ లేకుండా పోయిందని గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి అన్నారు.వాజేడు మండల కేంద్రంలో సోషల్ మీడియా వేదికగా గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ,



ములకలపల్లి మండలం,చౌటుగూడెం గ్రామానికి చెందిన ఆదివాసి బిడ్డ ఊయిక శిరీష అత్యాచారం చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని పూనెం సాయి డిమాండ్ చేశారు.79 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో ఒక ఆదివాసి మహిళకు స్వతంత్రంగా తిరిగే అవకాశ లేదని అన్నారు. ప్రజా పాలన అని పేరు చెప్పుకొని,ఈ రాష్ట్ర ప్రభుత్వం పబ్బం గడుపుతుంది తప్ప,ఈరోజు జరిగిన ఈ చర్యకు ఈ రాష్ట్ర ప్రభుత్వం తలదించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశార.ఒక ఆదివాసి మహిళ పై అత్యాచారం జరిగితే,ఆదివాసి ప్రజా ప్రతినిధులు ఇంత వరకు ప్రభుత్వం పై. ఎందుకు ఒత్తిడి తీసుకురావడం లేదని సూటిగా ప్రశ్నించారు.గతం లో ప్రియంకారెడ్డి అనే మహిళ పైన మనభంగం చెసినా వారి పైన పోలీస్ అధికారి సజ్జనార్ ఎలా అయ్యితే ఎన్కౌంటర్ చెసారో,ఆలానే ఆదివాసి బిడ్డ పైన మానభంగం చెసి చంపివేసిన షాన్ దుల్లాఖాన్ అనే మానవమృగం నీ ఎన్కౌటర్ చేయాలని డిమాండ్ చేశారు. వెంకటాపురం మండల కేంద్రంలో రేపు జరగబోయే నిరసన కార్యక్రమానికి ఆదివాసి ప్రజలు యువత మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం..

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్నగర్,(ప్రజావినికిడి):**
మున్సిపాలిటీ 3వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మించిన బుచ్చయ్యభారతమ్మ నూతన గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్,వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్లతో కలిసి నూతన గృహంలో గృహప్రవేశం నిర్వహించి, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. నూతన గృహాలను



పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడిన ఆయన,ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్,మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి,కౌన్సిలర్ పెంటయ్య, మురళీమోహన్



రాజు నాయక్, కొప్పునూరి ప్రవీణ్ కుమార్, మాజీ కౌన్సిలర్ రాజేందర్ రెడ్డి, శ్రీనివాస్,ముబారక్ అలీ ఖాన్, చందులాల్,కత్తి చంద్రశేఖరప్ప, సీతారాం, తుపాకుల శేఖర్, శ్రీనివాస్ రెడ్డి తదితర నాయకులు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మా గ్రామ పంచాయతీ సమస్యలు తీర్చండి

## ప్రజావాణిలో చెరుకూరు గ్రామ సమస్యలపై వినతిపత్రం

## మౌలిక వసతులు, తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తుల విజ్ఞప్తి

**వాజేడు, సెప్టెంబర్ 1,(ప్రజావినికిడి):**
వాజేడు మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో చెరుకూరు గ్రామ పంచాయతీ పరిధిలోని చెరుకూరు, రేగులపాడు, మోతుకూలగూడెం,బయ్యారం కాలనీ ప్రాంతాల్లో నెలకొన్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు గ్రామస్తులు, ఆదివాసీ నాయకులు కలిసి ఎంపిడిఓ కి వినతిపత్రం సమర్పించారు.

గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న వీధిలైట్లు, తాగునీరు,బోరు పంపులు, డ్రైనేజీ,మురుగు కాల్వలు, పారిశుద్ధ్యం, విద్యుత్ భద్రత వంటి సమస్యలను వినతిపత్రంలో వివరించారు. ప్రజల ఆరోగ్యం, భద్రత అలాగే దైనందిన అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని కోరారు.

చెరుకూరు గ్రామంలో గత మూడు నెలలుగా పనిచేయని వీధిలైట్లను మరమ్మతు చేసి పునరుద్ధరించాలని, మోతుకులగూడెం వాటర్ ట్యాంక్ ద్వారా తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. గ్రామంలో పాడైన బోరు పంపులను గుర్తించి మరమ్మతులు చేసి ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. శ్రీరామ ఫెర్టిలైజర్ షాప్ నుంచి వెళ్లే సీసీ రోడ్డు చివర అవసరమైన డ్రైనేజీ తూమును ఏర్పాటు చేయాలని కోరారు. చెరుకూరు సెంటర్‌లో పాఠశాల ముందు భాగంలో మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు, విషపురుగులు పెరుగుతున్నాయని,ప్రజలు, విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.




గ్రామంలోని మురుగు కాల్వలను క్రమం తప్పకుండా శుభ్రం చేయడం, చెత్తను తొలగించడం, ప్రతి వార్డులో బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమలు, విషపురుగుల నివారణకు అవసరమైన పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా వర్షపు నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి నీరు సక్రమంగా వెళ్లేలా డ్రైనేజీ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసి తొలగించాలని కోరారు. గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న పాడుబడిన బావులను గుర్తించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఆదివాసీ నాయకుల పాల్గొనడంప్రజావాణిలో ఆదివాసీ నాయకులు మండల అధ్యక్షులు మోడెం. నాగరాజు ఎట్టి విద్యాసాగర్ జిల్లా అధ్యక్షులు పాయం జానకిరావు, వాసం సంతోష్ కుమార్ పాల్గొని గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

వారితో పాటు గ్రామస్తులు పాయం ఆంజనేయులు, యాలం ఆదిత్య, పీర్ల రాంబాబు, కోరం మనోజ్ కుమార్,పీర్ల రవిరాజు, యాలం అశోక్, వాసం ఈశ్వరరావు, వాసం నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ ప్రజల సమస్యలను అధికారులు సానుకూలంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి, అత్యవసర సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు.

చెరుకూరు గ్రామ అభివృద్ధి ప్రజల సంక్షేమం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ ప్రజలు సమన్వయంతో ముందుకు సాగాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

# శిరీష కుటుంబానికి న్యాయం జరగాలి అని కొవ్వొత్తుల ర్యాలీ

### చెరుకూరు సెంటర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ

**వాజేడు, సెప్టెంబర్ 1,(ప్రజావినికిడి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ములకలపల్లి మండలం, చౌటుగూడెం గ్రామానికి చెందిన ఉయిక శిరీష హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తూ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం పట్ల ఆదివాసీ నవ నిర్మాణ సేన తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. శిరీష ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబానికి న్యాయం జరగాలని కోరుతూ వాజేడు మండలం చెరుకూరు సెంటర్‌లో ఆదివాసీ నవ నిర్మాణ సేన ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఆదివాసీ యువత, గ్రామస్తులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కొవ్వొత్తులు చేతబట్టి ఉయిక శిరీషకు నివాళులర్పించారు. శిరీష మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపి,ఘటనకు సంబంధించిన వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, బాధ్యులెవరైనా ఉంటే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ర్యాలీ అనంతరం చెరుకూరు సెంటర్‌లో ఐదు నిమిషాల పాటు మౌనం పాటించి, ఉయిక శిరీష ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అలాగే బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి, వారికి న్యాయం




గుమ్మడిదొడ్డిలో...

జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా ఆదివాసీ నవ నిర్మాణ సేన నాయకులు మాట్లాడుతూ, ఉయిక శిరీష మృతిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిజానిజాలను ప్రజల ముందుకు తీసుకురావాలి. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో మా పోరాటం కొనసాగుతుంది. అని పేర్కొన్నారు.

**గుమ్మడిదొడ్డిలో కొవ్వొత్తుల ర్యాలీ**

శిరీషపై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న




చెరుకూరు లో

శానాద్ ఉల్లా ఖాన్పై చట్టప్రకారం అత్యంత కఠినమైన శిక్ష విధించాలని కోరారు ఈ ఘటనపై ఆవేదన వ్యక్తం చేస్తూ గుమ్మడిదొడ్డి పంచాయతీ పరిధిలో స్థానిక యువకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. శిరీష ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ,ఆమె కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని వారు తెలిపారు.

## చౌదరి గూడ గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగంపై

# ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన గ్రామస్తులు..

**శంషాబాద్,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం లోని చౌదరిగూడ గ్రామ పంచాయతీ కార్యదర్శి మల్లెపల్లి రమేశ్ బాబు,గ్రామ పంచాయతీలో మల్టిపుల్ వర్కర్ గా పనిచేస్తున్న గుర్రంపల్లి రాకేష్ తదితరులపై వచ్చిన అవినీతి ఆరోపణలు,అక్రమ వసూళ్లు, పంచాయతీ నిధుల దుర్వినియోగం మరియు రికార్డులలో అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన గ్రామస్తులు.

చౌదరిగూడ గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగం పై ఆరోపణలు.

మా గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చిన కొన్ని తీవ్రమైన ఆర్థిక అలాగే పరిపాలనా అక్రమాలపై మీ దృష్టికి తీసుకువస్తున్నాము. ఈ అంశాలపై నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ నిర్వహించి,నిజానిజాలు నిర్ధారించి,అక్రమాలు నిర్ధారణ. నిధులవినియోగంపై ప్రత్యేక ఆడిట్ ద్వారా సమగ్రవిచారణ నిర్వహించి, అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై తగిన శాఖాపరమైన మరియుచట్టపరమైనచర్యలుతీసుకోవాలనీ మా విజ్ఞప్తి,




కావున పై ఆరోపణలు మరియు సమర్పించిన ఆధారాలను పరిగణనలోకి తీసుకొని, మండల స్థాయి అధికారుల నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ నిర్వహించవలసిందిగా కోరుకుంటూ,

విచారణ పూర్తయ్యే వరకు గ్రామ పంచాయతీకి సంబంధిత రికార్డులు,బిల్లులు,వౌచర్లు, రిజిస్టర్లు మరియు డిజిటల్ రికార్డులు భద్రపరచేలా తగిన ఆదేశాలు. ఇవ్వాలనికోరుతున్నాము. అక్రమాలు/నిధుల దుర్వినియోగం నిర్ధారణ అయితే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకొని,పంచాయతీ నిధులను తిరిగి రికవరీ చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

## లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..

**జిల్లేడు చౌదరిగూడ,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం లోని జిల్లేడు చౌదరిగూడ మండలం లో 12 మంది లబ్ధిదారులకు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన రూ. 530500 లక్షల విలువైన సీఎం సహాయనిధి 12 చెక్కులను సోమవారం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కల్యాణ లక్ష్మి,షాదీముబారక్,సీఎం సహాయనిది చెక్కులను ఎట్టి పరిస్థితుల్లో ఆపబోమని అన్నారు. ప్రతిపక్ష పార్టీలు కావాలని పనిగట్టుకొని ప్రజలను తప్పుతో పట్టించి అధికార పార్టీ పైన బురదజల్లేఎందుకు




ప్రయత్నిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకాల నిర్వహణలో లోపాలు గత ప్రభుత్వ హయాంలోనే జరిగాయని అలాంటి లోపాలకు అతీతంగా పథకాలను చట్టబద్ధంగా అమలు చేస్తామని ఆయన వెల్లడించారు. నిరుపేదలను ఆదుకునేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంచి పథకాలను రూపొందించారని,వాటిని అమలులోకి తెచ్చే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్,మాజీ అధ్యక్షుడు చలివేంద్రం పల్లి రాజు,పిర్జాపూర్ సర్పంచ్ నర్సింలు,మండల పార్టీ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# జిమ్నాస్టిక్స్‌లో 8 ఏళ్ల అనర్ఘ్య నిమ్మతోరికి స్వర్ణ పతకం

### రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటిన ఓక్‌రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థిని




**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** ఓక్‌రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన 8 ఏళ్ల నాలుగో తరగతి విద్యార్థిని అనర్ఘ్య నిమ్మతోరి తెలంగాణ రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి పాఠశాలకు, కుటుంబానికి గర్వకారణంగా నిలిచింది. నేడు జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె గ్రూప్ విభాగంలో స్వర్ణ పతకం, సోలో విభాగంలో రజత పతకం సాధించింది. ఈ పోటీలను హైదరాబాద్ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ ఏరోబిక్స్ ఫిట్‌నెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభావంతులైన పలువురు యువ క్రీడాకారులు పాల్గొని తమ నైపుణ్యం, క్రమశిక్షణ, అంకితభావాన్ని ప్రదర్శించారు. అనర్ఘ్య తన ఆత్మవిశ్వాసం, సౌలభ్యం, శారీరక బలం, సమతుల్యతతో పాటు అద్భుతమైన ప్రదర్శనతో న్యాయనిర్ణేతలను ఆకట్టుకుంది. ఆమె ప్రతిభకు గుర్తింపుగా గ్రూప్ విభాగంలో ప్రథమ స్థానం సాధించి స్వర్ణ పతకం, అలాగే సోలో విభాగంలో రజత పతకం అందుకుంది. అనర్ఘ్యకు స్వర్ణ పతకం,ప్రశంసా పత్రాన్ని అసోసియేషన్ అధ్యక్షులు జోగి కృష్ణ,ప్రధాన కార్యదర్శి రాజా సింగ్,సంయుక్త కార్యదర్శి బ్రహ్మానంద ప్రసాద్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆరోరా గ్రూప్ డైరెక్టర్ నిమ్మతోరి నిమిషా హాజరై అనర్ఘ్యను అభినందించారు. చిన్న వయసులోనే జిమ్నాస్టిక్స్‌లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన అనర్ఘ్య భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు.

## నైక బ్యూటీ బార్ హైదరాబాద్‌కు సెలబ్రేషన్ లుక్స్..




**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** హైదరాబాద్‌లోని బ్యూటీ లవర్స్ తమ సెలబ్రేషన్ ప్రిపరేషన్స్‌కు ముందుగానే శ్రీకారం చుట్టారు. నైక బ్యూటీ బార్ ఆగస్టు 28న సరత్ సిటీ క్యాపిటల్ మాల్‌లో నిర్వహించారు. బ్యూటీ ఎంథూసియాస్ట్‌లను ఒకచోట చేర్చి,నిపుణుల సలహాలు, ప్రొడక్ట్‌లను స్వయంగా ప్రయత్నించే అవకాశం, వ్యక్తిగతీకరించిన కన్సల్టేషన్స్‌తో పాటు రాబోయే సెలబ్రేషన్ సీజన్‌కు కావాల్సిన ఎన్నో బ్యూటీ ఇన్‌స్పిరేషన్స్‌ను అందించింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ మేకప్ ఆర్టిస్ట్ అలియా బేగ్ నిర్వహించిన ప్రత్యేక మాస్టర్‌క్లాస్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆమె సెలబ్రేషన్-రెడీ లుక్‌ను రూపొందిస్తూ, దాని వెనుక ఉన్న ప్రొడక్ట్స్ టెక్నిక్స్ గురించి తన నైపుణ్యాన్ని పంచుకున్నారు. అతిథులు అలియాతో నేరుగా మాట్లాడే అవకాశాన్ని పొందడంతో పాటు,ఆమె నిర్వహించి,జడ్జ్ చేసిన ఫేస్ ఆఫ్ ఛాలెంజెస్‌లో పాల్గొని తమ బ్యూటీ నాలెడ్జ్‌ను పరీక్షించుకున్నారు. తమ రోజువారీ బ్యూటీ రొటీన్‌లో ఉపయోగించుకోగల చిట్కాలను తెలుసుకోవడంతో పాటు,ఆ లుక్‌ను రూపొందించడానికి ఉపయోగించిన ప్రొడక్ట్స్‌ను మరింత దగ్గరగా తెలుసుకునే అవకాశం కూడా వారికి లభించింది. కొత్త బ్యూటీ ప్రొడక్ట్స్‌ను డిస్కవర్ చేయడానికి కూడా ఒక వేదికగా నిలిచిందనీ పేర్కొంది.

# కోనాయిపల్లి లో బోనాల వేడుకలు



**కేశంపేట(ప్రజావినికిడి):** మండలం లోని కోనాయిపల్లి గ్రామంలో బోనాల పండుగ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. గ్రామంలో నెలకొన్న పండుగ సందడి,భక్తుల కోలాహలం మధ్య నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, భక్తులతో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన..బోనాల పండుగకు ఉన్న విశిష్టతను, తెలంగాణ పల్లె సంస్కృతిలో ఇలాంటి సంప్రదాయ వేడుకల ప్రాధాన్యతను గుర్తు చేశారు. తరతరాలుగా కొనసాగుతున్న గ్రామీణ ఆచారాలు, సంప్రదాయాలను కాపాడుకుంటూ పండుగలను ఐక్యతతో నిర్వహించుకోవడం అభినందనీయమని అన్నారు. బోనాల సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించగా, గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ గ్రామ ప్రజలతో ఆప్యాయంగా మమేకమై, ఉత్సవాల విశేషాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు,పెద్దలు,మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జీవో 97 రద్దు చేయాలి.. విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి..

### విద్యార్థి సేన వ్యవస్థాపకుడు టి.కే శివప్రసాద్




**షాద్ నగర్,(ప్రజావినికిడి):**రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ముఖ్య కూడలిలో విద్యార్థి సేన ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ విద్యార్థులు జీఓ నంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థి సేన అధ్యక్షుడు టి.కె. శివ ప్రసాద్ మాట్లాడుతూ, జీఓ నంబర్ 97 వల్ల పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. మూడు సంవత్సరాల పాటు విద్యార్థులు ఎంతో కష్టపడి సాంకేతిక నైపుణ్యాలను అభ్యసించారని,వారి భవిష్యత్తును దెబ్బతీసే నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. పాలిటెక్నిక్ విద్యపై ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసినట్లు చెబుతున్నప్పుడు,ఇదే అంశంపై ముందుగానే కమిటీని ఏర్పాటు చేసి విద్యార్థుల అభిప్రాయాలను ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విద్యార్థుల భవిష్యత్తుపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే జీఓ నంబర్ 97ను తక్షణమే రద్దు చేయాలని శివకుమార్ డిమాండ్ చేశారు. జీఓను రద్దు చేయకపోతే విద్యార్థి సేన ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామనిహెచ్చరించారు. పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి,వారి భవిష్యత్తుకు నష్టం కలగకుండా తగిన నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.

## మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్పీ) నూతన నిర్మాణంలో భాగంగా మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడి నియామకం



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
సమాజంలో కొనసాగుతున్న రాజకీయ,సామాజిక అసమానతలపై పోరాటం చేసి సమానత్వాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్పీ) సీనియర్ నాయకులు ఎమ్మార్పీఎస్ ఎల్బీనగర్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి బత్తిన సుధాకర్ మాదిగ పిలుపునిచ్చారు. ఎంఎస్పీ నూతన నిర్మాణంలో భాగంగా మన్సూరాబాద్ డివిజన్‌కు నూతన అధ్యక్షుడిని నర్రా శ్రీనివాస్ నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు నర్రా శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గండి కోట భీంరాజు,ప్రధాన కార్యదర్శి గోపు శివ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ ఎంఆర్పీఎస్ మాజీ ఇంచార్జ్ బత్తిన సుధాకర్ మాదిగ మాట్లాడుతూ, అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం సాధించే దిశగా ఎంఎస్పీ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కాశీ మాదిగ, సీనియర్ నాయకులు క్రాంతికుమార్, గ్యారా యాదయ్య మాదిగ,ఏసు మాదిగ,దూది దుర్గ,గిరి, మణికంఠ,దేవా, యల్లయ్య, రాములు, దేవేందర్, సందీప్,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణికి (70) ఫిర్యాదులు..




**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (70) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం సమీక్షిస్తూ నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు 47,ఇతర శాఖలకు 23, మొత్తం 70 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## మజ్లిస్ నుంచి బహిష్కరణ.. ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్ మిస్సింగ్ కలకలం!

**హైదరాబాద్ (ప్రజావినికిడి):**
ఎంఐఎం నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్ అదృశ్యం కావడం హైదరాబాద్ రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ఉమ్రా యాత్ర ముగించుకుని శనివారం నగరానికి చేరుకున్న ఆయన, అప్పటి నుంచి కనిపించకుండా పోయినట్లు సమాచారం. ఇప్పటికే పలు తీవ్రమైన ఆరోపణలతో వివాదాల్లో చిక్కుకున్న ఆయన అదృశ్యం కావడం ఇప్పుడు అనేక అనుమానాలకు తావిస్తోంది. క్రమశిక్షణా చర్యల భాగంగా రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి తక్షణమే బహిష్కరిస్తున్నట్లు ఇటీవల ఎంఐఎం ప్రకటించింది. అంతేకాకుండా, ఎమ్మెల్సీ పదవికి సైతం రాజీనామా చేయాలని పార్టీ అధిష్ఠానం ఆయనను ఆదేశించింది. అయితే, రాజీనామా చేసేందుకు నిరాకరించిన ఆయన, తాను ఎంఐఎం కార్యకర్తగానే కొనసాగుతానని అప్పట్లో స్పష్టం చేశారు.
రహ్మత్ బేగ్ ఒక మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారంటూ సామాజిక మాధ్యమాల్లో తీవ్రస్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే, ఈ ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. తనను అప్రతిష్ఠపాలు చేసేందుకు కొందరు కావాలనే మార్ఫింగ్, డీప్‌ఫేక్ వీడియోలు, ఫోటోలను సృష్టించి ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. గుర్తుతెలియని వ్యక్తులు డబ్బుల కోసం తనను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, దీనిపై ఇప్పటికే హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఈ వ్యవహారంలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తనకు న్యాయం చేస్తారని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# ఉపాధ్యాయుల సేవలు సమాజానికి చిరస్మరణీయం

### గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి..


### తాళ్లపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సూరం విష్ణువర్ధన్ రెడ్డి పదవీ విరమణ సందర్భంగా ఘన సన్మానం

**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
జిల్లాలోని షాబాద్ మండలం తాళ్లపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సూరం విష్ణువర్ధన్ రెడ్డి పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి హాజరై పదవీ విరమణ చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు సూరం విష్ణువర్ధన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ చిన్మామైల్ అంజిరెడ్డి మాట్లాడుతూ,విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఒక ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా సూరం విష్ణువర్ధన్ రెడ్డి అందించిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నారు. పదవీ విరమణ అనేది సేవలకు ముగింపు కాదని,జీవితంలో మరో కొత్త అధ్యాయానికి ప్రారంభమని పేర్కొంటూ,సూరం విష్ణువర్ధన్ రెడ్డి భవిష్యత్తులో మరింత సంతోషంగా, ఆయురారోగ్యాలతో జీవించాలని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ 9వ వార్డ్ కౌన్సిలర్ అశోక్ కుమార్ ప్యాట, అనిల్ గౌడ్,శేఖర్ రెడ్డి, రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది,విద్యార్థులు,గ్రామ పెద్దలు,స్థానిక నాయకులు తదితరులు పాల్గొని పదవీ విరమణ పొందుతున్న ప్రధానోపాధ్యాయుడు సూరం విష్ణువర్ధన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# రామ్ నగర్ కాలనీలో బొడ్రాయి ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం

### కార్యక్రమంలో పాల్గొన్నఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాద్ నగర్ పట్టణంలో రామ్ నగర్ కాలనీలో బొడ్రాయి మరియు పోచమ్మ ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై ప్రత్యేక మొక్కలు చెల్లించుకున్నారుఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ, దైవచింతనతోనే సమాజంలో శాంతి లభిస్తుందని కాలనీ ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, బొడ్రాయి పండుగలు ప్రజలలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వాణి పాండురంగారెడ్డి,బీఎస్ సుధీర్,మాజీ కౌన్సిలర్లు శ్రీనివాస్ గౌడ్,చింటు ప్రతాప్ రెడ్డి,ఈశ్వర్ రాజు,చిన్న యాదగిరి,పాలమూకుల చెన్నయ్య,మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణు వర్ధన్ రెడ్డి,మాజీ ఉపసర్పంచ్ సత్యనారాయణ,బి అర్ ఎస్ నాయకులు బాలక్రిష్ణ,బాల్ రాజ్, లడ్డు(ఇబ్రహీం), శ్రీను,మల్లేష్,తదితరులు పాల్గొన్నారు

# గాంధీ, బసవతారకం ఆస్పత్రుల వద్ద పేదలకు ‘రెడీ టూ సర్వ్‘ ఫౌండేషన్ అన్నదానం

### అనూప్ చక్రవర్తి జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమం




**ఎల్బీనగర్,ఆగస్ట్ 31, (ప్రజావినికిడి):**
గాంధీ, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రుల వద్ద రెడీ టూ సర్వ్ ఫౌండేషన్, ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి వద్ద చికిత్స కోసం వచ్చిన పేద రోగులు,వారి కుటుంబ సభ్యులు, అవసరమైన వారికి రెండు చోట్ల సుమారు వెయ్యి మందికి ఉచితంగా భోజనం పంపిణీ చేశారు. టీటీడీ దేవస్థానం మాజీ ఎల్ఏసీ మెంబర్, శ్రీమాన్ గ్రూప్ ఎండీ ఐత అనూప్ చక్రవర్తి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ సేవా కార్యక్రమంలో పలువురు స్వచ్ఛందంగా వాలంటీర్లుగా పాల్గొని, స్వయంగా ఆహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు, వాలంటీర్లు స్వచ్ఛందంగా సేవలందిస్తూ వందలాది మందికి ఆహారం అందించారు. సమాజంలో ఆకలితో బాధపడుతున్న వారికి అండగా నిలవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. పేద ప్రజల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించనున్నట్లు వెల్లడించారు. ఆస్పత్రుల వద్ద చికిత్స కోసం నిరీక్షించే పేద రోగులు,వారి కుటుంబ సభ్యులకు ఈ అన్నదానం ఎంతో ఉపయోగకరంగా మారిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ‘రెడీ టూ సర్వ్‘ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకులు పెద్ది శంకర్ మాట్లాడుతూ, సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలనుకునే దాతలు, స్వచ్ఛంద సేవకులు తమను సంప్రదించాలని కోరారు. సమాజ సేవలో మరింత మంది భాగస్వాములు కావడం ద్వారా అవసరమైన వారికి మరింత విస్తృతంగా సహాయం అందించగలమని ఆయన పేర్కొన్నారు.

# సెప్టెంబర్ 8న రెడ్డిల నిరసన దీక్ష




**నాంపల్లి, (ప్రజావినికిడి):**
పేద రెడ్ల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రెడ్డి కార్పొరేషన్‌ను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి పాలకవర్గాన్ని నియమించాలని ఈ మేరకు సెప్టెంబర్ 8న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద రెడ్డిల మహా నిరసన కార్యక్రమ దీక్షను చేపట్టనున్నట్లు
రెడ్డి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అప్పం రామ్ రెడ్డి తెలిపారు.
ఈ సందర్భంగా బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు పోస్టర్ ను ఆవిష్క రించి మాట్లాడారు.
2013 నుంచి నిరుపేద రెడ్ల హక్కుల సాధన కోసం అనేక ఉద్యమాలు, పాదయాత్రలు, బహిరంగ సభలు నిర్వహించినప్పటికీ ప్రభుత్వం హామీలను అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్యాబినెట్‌లో రెడ్డి కార్పొరేషన్‌పై తీర్మానం చేసినప్పటికీ ఇప్పటి వరకు పాలకవర్గం ఏర్పాటు చేయకపోవడం, నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు.
రెడ్డి కార్పొరేషన్ కు రూ.1,000 కోట్లు,15 ఎకరాల భూమి,రైతు బీమా పునరుద్ధరణ,ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లు పూర్తి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి హాస్టల్ కోసం గత ప్రభుత్వం కేటాయించిన 15 ఎకరాల భూమిని యథాస్థానంలోనే పేద రెడ్ల ప్రయోజనాల కోసం కొనసాగించాలని అభిలాషించారు. కేంద్రం అమలు చేస్తున్న 10 శాతం ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లను విద్య, ఉద్యోగాలు, మెడికల్ సీట్లలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 8న ఇందిరా పార్క్ వద్ద వేలాది మంది పేద రెడ్లతో మహా నిరసన దీక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెడ్డి సామాజిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్టెం మాధవ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు గోపు జైపాల్ రెడ్డి, ఐక్యవేదిక అధ్యక్షులు నాగరి చంద్రారెడ్డి,పైల్ల హరినాథ్ రెడ్డి, ఆర్కుల కిషన్ రెడ్డి, రెడ్డి సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ జెండాకు అవమానంపై మూల్యం తప్పదు

### ఖలిస్థానీ వేర్పాటువాదులకు కిరణ్ రిజిజు హెచ్చరిక

**న్యూఢిల్లీ, ఆగస్టు 31 (ప్రజావినికిడి):**



న్యూయార్క్‌లో భారత జాతీయ జెండాను అవమానించిన ఖలిస్థానీ వేర్పాటు వాదులకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఇలాంటి వారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఎక్స్ వేదికగా హెచ్చరించారు. న్యూయార్క్‌లో మ్యాడిసన్ స్క్వేర్ గార్డెన్ వేదికగా జరిగిన సభలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ హాజరైన సందర్భంగా స్టేడియం బయట జరిగిన ఈ ఘటన తాలూకు వీడియోను మంత్రి నెట్టింట షేర్ చేశారు. 'ఆర్ఎస్ఎస్‌ను లేదా బీజేపీని విమర్శించే హక్కు మీకు ఉందని మేము ఎప్పటి నుంచో చెబుతూనే ఉన్నాము. కానీ మా దేశాన్ని అవమానించవద్దు. మీరు ఓ విషయాన్ని జాగ్రత్తగా వినండి. మా దేశాన్ని, జెండాను అవమానిస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు' అని కేంద్ర మంత్రి తన పోస్టులో వార్నింగ్ ఇచ్చారు. వీడియోలో కనిపించిన దాని ప్రకారం, స్టేడియం బయట ఖలిస్థానీలు నానా రభసా సృష్టించారు. ఓ వ్యక్తి తన కాలికి భారత జాతీయ జెండాను చుట్టుకుని అటూ ఇటూ ఊపుతూ అవమానించాడు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని నెట్టింట పలువురు డిమాండ్ చేశారు. నిందితులను గుర్తించాలని యూఎస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆర్ఎస్ఎస్ సంస్థ 100 ఏళ్లు పూర్తి చేసుకున్న తరుణంలో ంఊఇంఆ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటైన ఈ సభలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రసంగించారు. అమెరికాలో ఉంటూ ఉపాధి పొందే వారు కర్మ భూమి పట్ల తమ బాధ్యతను నెరవేర్చాలని పిలుపునిచ్చారు. వివిధ దేశాల్లో హిందువులు బాధ్యతాయుత జీవనంతో ఆదర్శవంతంగా నిలవాలని అన్నారు.

## భారత్ -బంగ్లా సరిహద్దుల్లో భారీగా బంగారం పట్టివేత

**కోల్‌కతా, ఆగస్టు 31(ప్రజావినికిడి):**

భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు సమీపంలో అక్రమంగా దాచి ఉంచిన బంగారాన్ని బీఎస్ఎఫ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమబెంగాల్-బంగ్లాదేశ్ సరిహద్దులోని బన్‌పూర్ గ్రామంలో ఓ మహిళ కొంతకాలంగా అనుమానాస్పదంగా సంచరిస్తుండటాన్ని జవాన్లు గమనించారు. అనంతరం ఆమెపై నిఘా పెట్టి ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే మహిళ ఇంట్లో సోదాలు చేయగా.. 15.6 కిలోల బంగారం బయటపడింది. దాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ పసిడి విలువ రూ.24కోట్లకు పైనే ఉంటుందని అధికారులు తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో బంగారం సరిహద్దుకు ఎలా చేరింది? దానిని ఎవరికి ఇవ్వడానికి మహిళ ప్రయత్నిస్తుందనే వివరాలు తెలుసుకోవడానికి దర్యాప్తు చేపట్టారు. దీని వెనుక అంతర్జాతీయ స్మగ్లింగ్ నెట్‌వర్క్ ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ దిశగా ఆరా తీస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

## ఎస్సెల్ గ్రూపు దివాళ ప్రకటన

### భారీగా పడిపోయిన షేర్ల ధరలు

**ముంబై, ఆగస్టు 31 (ప్రజావినికిడి):** ఎస్సెల్ గ్రూప్ ఛైర్మన్ సుభాష్‌చంద్రకు చెందిన మీడియా కంపెనీ జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు కుంగాయి. సోమవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో ఇంట్రాడేలో 14 శాతం మేర క్షీణించాయి. రూ.86.90 వద్ద కనిష్ఠాన్ని తాకాయి. ఆ తర్వాత కాస్త కోలుకున్నాయి. గడిచిన నాలుగు సెషన్లలో ఈ షేరు విలువ 17 శాతం మేర పతనమై.. మూడు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఎన్‌సీఎల్‌టీ తీర్పునకు వ్యతిరేకంగా కెనరా బ్యాంక్, యూనియన్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ అప్పీల్‌కు వెళతామని ప్రకటించిన నేపథ్యంలో ఈ షేర్లు కుంగాయి. ఎస్సెల్ గ్రూప్ వ్యవస్థాపకులు సుభాష్ చంద్ర వ్యక్తిగత దివాలా పరిష్కార ప్రణాళిక ఆమోదం పొందడంపై అసమ్మతి రుణదాతలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. రుణదాతలు పేర్కొన్న రూ.22,006.57 కోట్ల ÷-లకెయిమ్‌లకు గానూ కేవలం రూ.6.5 కోట్లే చెల్లించేలా ఉన్న దివాలా ప్రణాళికకు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం తెలపడంతో ఈ వివాదం మొదలైంది. దీనిపై బ్యాంకులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. ఆయన కుటుంబంతో సంబంధం ఉన్న 5 ఆర్థిక సంస్థల ఓట్లతోనే రుణ ప్రణాళిక ఆమోదం పొందినట్లు ఆరోపిస్తున్నాయి. దీంతో ఈ వ్యవహారంపై అప్పీల్‌కు వెళ్లనున్నట్లు ప్రకటించాయి. అయితే, ఈ రుణాలకు తాను వ్యక్తిగత హామీదారుగా మాత్రమే ఉన్నానని, అసలు క్లెయిమ్ రూ.3,992 కోట్లు మాత్రమేనని సుభాష్ చంద్ర పేర్కొనడం గమనార్హం.

# అమెరికా-కెనడా మధ్య వాణిజ్య యుద్ధం

**కెనడా దారుణమైన దుర్వినియోగదారు**

**కెనడాలో ఉన్న కంపెనీలన్నీ అమెరికాకు వచ్చేయాలి**

**ట్రూత్‌లో ట్రంప్ వరుస పోస్టులు**

**వాషింగ్టన్, ఆగస్టు 31(ప్రజావినికిడి):**

అమెరికా-కెనడా మధ్య వాణిజ్య యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలకు కెనడా ప్రధాని మార్క్ కార్నీ సహా ఇతర నేతలు గట్టిగా బదులు ఇస్తుండటంతో రెండు దేశాలు సంబంధాలు దిగజారుతున్నాయి. ఈ క్రమంలోనే ట్రంప్ మరోసారి ఆ దేశంపై విరుచుకుపడ్డారు. తమకు కెనడా నుంచి ఏమీ వద్దని పేర్కొన్న ఆయన తమ సుంకాలను తప్పించుకునేందుకు అక్కడి కంపెనీలన్నీ అమెరికాకు తరలివచ్చేయాలని సూచించారు. ఆ దేశం దారుణమైన దుర్వినియోగదారు అని మండిపడ్డారు. ఈ మేరకు ట్రూత్‌లో వరుస పోస్టులు పెట్టారు.



2024 అధ్యక్ష ఎన్నికల్లో నేను పోటీ చేస్తున్నానని ప్రకటించిన సమయంలోనే డెట్రాయిట్‌లోని కీలక ఫ్యాక్టరీని మూసివేయడానికి ఫోర్డ్ సిద్ధమైంది. ఎన్నికల్లో నేను ఆధిక్యంలోకి రావడంతో ఏం జరుగుతుందో చూద్దామని ఆ సంస్థ వేచి చూసింది. ఇప్పుడు నిరంతరాయంగా నడుస్తూ.. భారీగా లాభాలను ఆర్జిస్తోంది. జనరల్ మోటార్స్, ఇతర సంస్థల విషయంలో ఇలాంటి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. సుంకాల వల్లే ఇదంతా జరిగింది. మనకు కెనడియన్ కార్లు, పరికరాలు సహా ఏమీ వద్దు. కెనడాతో వాణిజ్యంలో అమెరికా ఏటా 60 బిలియన్ డాలర్లకుపైగా నష్టపోతోంది. దశాబ్దాలుగా ఈ దోపిడీ జరుగుతోంది. ఏనాడో మననుంచి లాగేసుకున్న వ్యాపారాలన్నీ సుంకాలను తప్పించుకోవడానికి ఇప్పుడు అమెరికాకు బారులు తీరుతున్నాయి. కెనడా పట్ల కఠిన వైఖరిని అవలంబించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని ట్రంప్ విమర్శలు చేశారు. అమెరికా-కెనడా మధ్య వాణిజ్య ఒప్పందం చివరి నిమిషంలో రద్దయింది. అమెరికా ఇప్పటికే 50 శాతం సుంకాలతో విరుచుకుపడగా.. కెనడా సైతం అగ్రరాజ్యంపై తాజాగా ప్రతీకార సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. కెనడియన్ కార్లు, ట్రక్కులు, ఆటోమోటివ్ విడిభాగాలు, ఉక్కు దిగుమతులపై ట్రంప్ 50శాతం టారిఫ్‌లు విధించారు.

# పరిశ్రమలన్నీ 33 శాతం పచ్చదనాన్ని పాటించాలి

**రేపటి తరాలకు పచ్చని భవిష్యత్తును అందించేందుకు సహకరించాలి**

**పారిశ్రామిక వర్గాలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు**

**మంగళగిరి, ఆగస్టు 31 (ప్రజావినికిడి):**

రాష్ట్ర ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమైనదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలు పర్యావరణ నిబంధనలను తు.చ. తప్పక పాటించాలని స్పష్టం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పరిశ్రమ తన ప్రాంగణంలో కనీసం 33 శాతం పచ్చదనాన్ని అభివృద్ధి చేసి, సంరక్షించే బాధ్యతను చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి పారిశ్రామికవేత్త దీనిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి కార్యాలయం నుండి ప్రకటన విడుదలయ్యింది. పరిశ్రమల పరిసరాల్లో మొక్కలు నాటడం ద్వారా వాయు కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించవచ్చని పవన్ కళ్యాణ్ తెలిపారు. భావితరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన, పచ్చని భవిష్యత్తును అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. పరిశ్రమలు తమ సామాజిక బాధ్యతలో భాగంగా పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి, పర్యావరణ సమతుల్యతను



కాపాడేందుకు ముందుకు రావాలని సూచించారు. అభివృద్ధి, ప్రకృతి పరిరక్షణలను సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లినప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా సమాజానికి, ప్రకృతికి, రాబోయే తరాలకు విలువైన భవిష్యత్తును అందించగలమని పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రకాల పరిశ్రమలు 33 శాతం పచ్చదనం నిబంధనను కచ్చితంగా అమలు చేసేలా కాలుష్య నియంత్రణ మండలి, ఏపీ-గ్రీన్ సంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 2026 గణాంకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా పోర్టులు, సిమెంట్, మైనింగ్, ఎనర్జీ, ఆహార శుద్ధి, ప్లాస్టిక్, పేపర్, వస్త్రాలు తదితర రంగాలకు చెందిన సుమారు 3,400 పరిశ్రమలు, కంపెనీలు వేలాది ఎకరాల విస్తీర్ణంలో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 14 రోజుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, తొలి విడతగా పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రవ్యాప్తంగా 26 పరిశ్రమల్లో 129 ఎకరాల విస్తీర్ణంలో పచ్చదనం పెంపొందించే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన పరిశ్రమల యాజమాన్యాలను పవన్ కళ్యాణ్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పరిశ్రమలు 33 శాతం పచ్చదనం లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని కోరారు. ముఖ్యంగా విశాఖపట్నం వంటి నగరాలకు సమీపంలో ఉన్న పరిశ్రమలు ఈ నిబంధనను కచ్చితంగా అమలు చేసి, పట్టణ ప్రజలు కాలుష్య ప్రభావానికి గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. శ్రీ సిటీ, పరవాడ తదితర ప్రాంతాల్లోని ప్రత్యేక ఆర్థిక మండలాలు (ాఇజిలు) కూడా 33 శాతం పచ్చదనాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు. 2047 నాటికి రాష్ట్ర భూభాగంలో 50 శాతం పచ్చదనాన్ని సాధించాలన్న మహత్తర సంకల్పంలో పారిశ్రామిక వర్గాలు చురుకుగా భాగస్వాములు కావాలని ఉప ముఖ్యమంత్రివర్యులు పిలుపునిచ్చారు.

# హిమాలయాల్లో వాటర్ బాంబ్స్ !

**ఆగస్టు 31 (ప్రజావినికిడి):**

నేపాల్‌లో సంభవించిన భారీ వరదలు మరోసారి హిమాలయ ప్రాంతాల్లోని హిమానీనద సరస్సులపై ఆందోళనలను పెంచాయి. ముఖ్యంగా భారత్ ఎగువన హిమాలయాల్లో హిమానీ నదాల పరిస్థితిపై ఆందోళన కలుగుతోంది. మనదేశంలో అలాంటి ఉపద్రవమే జరిగితే పలు రాష్ట్రాలు కొట్టుకుపోక తప్పదు.

హిమానీనదాల కరిగే పక్రియలో ఏర్పడే సరస్సుల్లో భారీ మొత్తంలో నీరు నిల్వ ఉంటుంది. వీటిని నియంత్రించే సహజ మంచు, రాళ్లు లేదా మట్టి అడ్డంకులు బలహీనపడితే ఒక్కసారిగా నీరు బయటకు దూసుకెళ్లే ప్రమాదం ఉంటుంది. భారీ వర్షాలు, హిమానీనదాల కరుగుదల, కొండచరియలు విరిగిపడటం, భూకంపాలు వంటి కారణాలతో సరస్సు అడ్డంకులు తెగిపోతే దిగువ ప్రాంతాలకు ఒక్కసారిగా భారీగా నీరు, బురద, రాళ్లు, మట్టి కొట్టుకురావచ్చు. అందుకే ప్రమాదకర హిమానీనద సరస్సులను నిపుణులు కొన్నిసార్లు 'వాటర్ బాంబ్స్'గా అభివర్ణిస్తారు. నేపాల్‌లో జరిగిన వరదలు హిమాలయ ప్రాంతాల్లో ప్రకృతి వైపరీత్యాలు ఎంత వేగంగా భారీ విపత్తులుగా మారగలవో మరోసారి చూపిస్తున్నాయి. ముఖ్యంగా హిమానీనద సరస్సుల సంఖ్య, వాటి నీటి నిల్వ సామర్థ్యం, వాతావరణ మార్పుల ప్రభావం, పర్వత ప్రాంతాల్లో పెరుగుతున్న నిర్మాణాలు వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం. హిమాలయాల్లోని హిమానీనద సరస్సుల ప్రమాదాన్ని నిర్లక్ష్యం చేస్తే, పర్వత ప్రాంతాలతో పాటు దిగువ మైదాన ప్రాంతాల్లోనూ భారీ వరదలు



సంభవించే అవకాశం ఉంది. అందుకే ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, ఉపగ్రహ పర్యవేక్షణ, ప్రమాద మ్యాపింగ్, శాస్త్రీయ ఇంజనీరింగ్ చర్యలు అత్యంత కీలకంగా మారుతున్నాయి. నేపాల్-టిబెట్ సరిహద్దులో హిమానీనదం విస్ఫోటనం కారణంగా భోటేకోశీ, త్రిశూలి నదుల్లో భారీగా వరదలు సంభవించినట్లు సమాచారం. ఈ ఘటనతో మధ్య నేపాల్‌లోని పలు ప్రాంతాల్లో తీవ్ర నష్టం జరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. అడపాదడపా కురుస్తున్న భారీ వర్షాలు, టిబెట్‌లో నదీ మూల ప్రాంతానికి సమీపంలో కొత్తగా తాత్కాలిక సరస్సు ఏర్పడటంతో భోటేకోశి నదిలో నీటిమట్టం మళ్లీ పెరిగినట్లు సమాచారం. దీంతో దిగువ ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తత ప్రకటించారు. నేపాల్‌లో జరిగిన ఈ ఘటనతో ఇప్పుడు భారత హిమాలయ ప్రాంతాల్లో ఉన్న హిమానీనద సరస్సుల భద్రతపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ సీనియర్ సలహాదారు ఒకరు తెలిపిన వివరాల ప్రకారం, భారత హిమాలయ ప్రాంతంలోని 11 నదీ పరీవాహక ప్రాంతాల్లో సుమారు 28,000 హిమానీనద సరస్సులు ఉన్నాయి. వాటిలో దాదాపు 7,500 సరస్సులు భారతదేశంలోనే ఉన్నట్లు అంచనా. ఒక్క గంగా నదీ పరీవాహక ప్రాంతంలోనే 4,700కు పైగా హిమానీనద సరస్సులు ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే వీటిలో కొన్ని సరస్సులు అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సుమారు 195 నుంచి 200 సరస్సులను అధిక ప్రమాదం ఉన్న సరస్సులుగా గుర్తించినట్లు సమాచారం. నేపాల్‌లోని ఘటనలో సహజ పరిస్థితులతో పాటు మానవ కార్యకలాపాలు కూడా నష్టాన్ని పెంచినట్లు నిపుణులు పేర్కొంటున్నారు. టిబెట్, నేపాల్‌లోని పర్వత ప్రాంతాల్లో పర్యావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా నిర్మాణాలు చేపట్టడం, నదుల సహజ ప్రవాహ ప్రాంతాల్లో నివాసాలు ఏర్పడటం వంటి కారణాలు ప్రమాద తీవ్రతను పెంచే అవకాశం ఉంది. అదేవిధంగా, ఇజీస చిజీసనితినిణ ఃూబబి।ప (ఇచా) సకాలంలో పనిచేయకపోతే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు తగినంత సమయం లభించదు. దీంతో ప్రాణ, ఆస్తి నష్టం మరింత పెరిగే ప్రమాదం ఉంటుంది. భారత హిమాలయ ప్రాంతంలోని ప్రమాదకర హిమానీనద సరస్సులు పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. హిమాలయ ప్రాంతాల్లోని సరస్సులు పొంగిపొర్లితే ప్రభావం

కేవలం పర్వత ప్రాంతాలకే పరిమితం కాకపోవచ్చు. భారీ మొత్తంలో నీరు, మట్టి, రాళ్లు దిగువకు ప్రవహించి నదుల నీటిమట్టాన్ని ఒక్కసారిగా పెంచవచ్చు. ప్రత్యేకంగా నేపాల్ లేదా సిక్కిం ప్రాంతాల్లో భారీ వరదలు సంభవిస్తే కోసి, గండక్, తీస్తా వంటి నదుల ద్వారా నీరు దిగువ మైదాన ప్రాంతాలకు చేరే ప్రమాదం ఉంటుంది. దీంతో ఉత్తర బీహార్‌లోని సుపాల్, సహర్సా, మధుబని, చంపారన్ వంటి ప్రాంతాలు, అలాగే ఉత్తర బెంగాల్‌లోని జల్పైగురి, సిలిగురి, డార్జిలింగ్ టెరాయ్ ప్రాంతాల్లో వరద ముప్పు పెరిగే అవకాశం ఉంది. ప్రమాదకర సరస్సులను పర్యవేక్షించేందుకు అధికారులు పలు చర్యలు చేపడుతున్నట్లు సమాచారం.

ధిక ప్రమాదం ఉన్న సరస్సుల చుట్టూ ప్రమాద ప్రాంతాలను గుర్తించి, అక్కడ కొత్త నిర్మాణాలు, నివాసాలను నియంత్రించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. సరస్సుల్లోని నీటిని సురక్షితంగా బయటకు పంపేందుకు చెక్‌డ్యామ్‌లు, డ్రైనేజీ వ్యవస్థలు, నీటి మళ్లింపు నిర్మాణాలు వంటి చర్యలను పరిశీలిస్తున్నారు.

అధిక ప్రమాదం ఉన్న సరస్సుల్లో ఆటోమేటిక్ ముందస్తు హెచ్చరిక సెన్సార్లను ఏర్పాటు చేసే ప్రణాళికలు ఉన్నాయి. నీటి మట్టం, ఉష్ణోగ్రత, ఇతర మార్పులను నిరంతరం పర్యవేక్షించడం ద్వారా ప్రమాదాన్ని ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది. ఉపగ్రహ పర్యవేక్షణ ద్వారా సరస్సుల పరిమాణం, నీటి మట్టం, పరిసర ప్రాంతాల్లో మార్పులను గుర్తించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అధిక ప్రమాదం ఉన్న హిమానీనద సరస్సుల వద్ద రాబోయే రెండేళ్లలో ఆటోమేటిక్ ముందస్తు హెచ్చరిక సెన్సార్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఇలాంటి వ్యవస్థలు పూర్తిస్థాయిలో అందుబాటు లోకి వస్తే ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి దిగువ ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయడం, అవసరమైతే ఖాళీ చేయించడం సులభమవుతుంది.

# వైభవ్ సూర్యవంశీ చేజారిన శతకం



టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ (81 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్స్‌లతో 92)తృటిలో శతకాన్ని చేజార్చుకున్నాడు. దులీప్ ట్రోఫీ 2026లో ఈస్ట్ జోన్‌కు వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న వైభవ్ సూర్యవంశీ.. సెంట్రల్ జోన్‌తో జరుగుతున్న సెమీఫైనల్లో ఆకాశమే హద్దుగా చెలరేగాడు.బెంగళూరులోని బీసీసీఐ సీఓఈ మైదానంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన వైభవ్ సూర్యవంశీ.. వన్డే తరహా బ్యాటింగ్‌తో బౌలర్లపై విరుచుకుపడ్డాడు. తన ఫియర్‌లెస్ బ్యాటింగ్‌తో మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్‌ను తలపించాడు. తనకే సాధ్యమైన భారీ సిక్సర్లతో బౌలర్లకు చుక్కలు చూపించాడు.42 బంతుల్లోనే 5 ఫోర్లు, 6 సిక్స్‌లతో అర్ధశతకం పూర్తి చేసుకున్న వైభవ్.. ఫాస్టెస్ట్ సెంచరీ దిశగా సాగాడు. కానీ హర్ష్‌దూబే బౌలింగ్‌లో భారీ షాట్ ఆడే ప్రయత్నంలో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. బౌండరీ లైన్‌పై అర్షద్ ఖాన్ అద్భుతమైన క్యాచ్ అందుకోవడంతో వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర ఇన్నింగ్స్ ముగిసింది. 8 పరుగుల దూరంలో సెంచరీ చేజారడంతో వైభవ్ సూర్యవంశీ తీవ్ర అసహనానికి గురయ్యాడు. మైదానం వీడే క్రమంలో బ్యాట్‌ను బలంగా నేలకు కొట్టి అసహనం వ్యక్తం చేశాడు. దులీప్ ట్రోఫీ చరిత్రలోనే అత్యంత పిన్న వయసులో హాఫ్ సెంచరీ బాదిన ఆటగాడిగా వైభవ్ సూర్యవంశీ చరిత్రకెక్కాడు. 15 ఏళ్ల 175 రోజుల వయసులో వైభవ్ ఈ ఘనత సాధించి 57 ఏళ్ల రికార్డ్‌ను బద్దలు కొట్టాడు. 1969లో లక్ష్మణ్ సింగ్ 16 ఏళ్ల 23 రోజుల వయసులో దులీప్ ట్రోఫీలో హాఫ్ సెంచరీ బాదగా.. ఆ రికార్డ్‌ను తాజాగా వైభవ్ సూర్యవంశీ అధిగమించాడు. అభిమన్యు ఈశ్వరన్‌తో కలిసి తొలి వికెట్‌కు వైభవ్ 161 పరుగులు జోడించాడు. కానీ అతను ఔటైన తర్వాత ఈస్ట్ జోన్ ఇన్నింగ్స్ పేకమేడలా కుప్పకూలింది. మరో 105 పరుగులు మాత్రమే జోడించి 57 ఓవర్లలో 266 పరుగులకు ఆలౌటైంది. అభిమన్యు ఈశ్వరన్(69) హాఫ్ సెంచరీతో రాణించగా.. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. సెంట్రల్ జోన్ బౌలర్లలో హర్ష్ దూబే(4/66) నాలుగు వికెట్లు తీయగా.. యశ్ ఠాకూర్, ఆర్యన్ పాండే మూడేసి వికెట్లు పడగొట్టారు. దాంతో ఈస్ట్ జోన్‌కు ఒక్క పరుగు కూడా ఆధిక్యం దక్కలేదు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్ జోన్.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 20 ఓవర్లలో 3 వికెట్లకు 45 పరుగులు చేసింది. కునాల్ చందేలా(2), ఆర్యన్ జుయాల్(8), రజత్ పాటిదార్(5) విఫలమవ్వగా.. క్రీజులో అమన్ మోకడే(23 బ్యాటింగ్), ఆర్యన్ పాండే(4 బ్యాటింగ్)లు ఉన్నారు. ఈస్ట్ జోన్ బౌలర్లలో ముఖేష్ కుమార్ రెండు వికెట్లు తీయగా.. మహమ్మద్ షమీ ఒక వికెట్ పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సెంట్రల్ జోన్.. 80.1 ఓవర్లలో 266 పరుగులకు ఆలౌటైంది. రింకూ సింగ్(88 బంతుల్లో 8 ఫోర్లతో 60) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించగా.. ఆర్య జుయల్(113 బంతుల్లో 6 ఫోర్లతో 46) హాఫ్ సెంచరీ చేజార్చుకున్నాడు. ఈస్ట్ జోన్ బౌలర్లలో ముఖేష్ కుమార్(3/56), అభిజిత్ సర్కార్(3/38) మూడేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ షమీ, మహమ్మద్ కౌనైన్ రెండేసి వికెట్లు తీసారు.

# హార్దిక్, నితీష్ రెడ్డి రీఎంట్రీ!

శ్రీలంకతో టెస్ట్ సిరీస్ గెలిచిన భారత్.. మళ్లీ వైట్ బాల్ ఫార్మాట్‌కు సిద్ధమైంది. సొంతగడ్డపై సెప్టెంబర్ 13 నుంచి ప్రారంభమయ్యే మూడు టీ20ల సిరీస్‌లో ఆతిథ్య అఫ్గానిస్థాన్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. ఈ సిరీస్ ఆడే భారత జట్టును బీసీసీఐ ఇంకా ప్రకటించలేదు. అజిత్ అగార్కర్ సారథ్యంలో సెలెక్షన్ కమిటీ.. టీమ్ ఎంపికపై ఫోకస్ పెట్టింది. మరో రెండు రోజుల్లో జట్టును ప్రకటించే అవకాశం ఉంది. గాయాలతో జట్టుకు దూరమైన హార్దిక్ పాండ్యా, నితీష్ కుమార్ రెడ్డి ఈ సిరీస్‌తో రీఎంట్రీ ఇచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ఇద్దరూ బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ)లో ఉన్న సంగతి తెలిసిందే. వాషింగ్టన్ సుందర్ సీవోఈలో ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాల్సి ఉంది. ప్రస్తుతం అతను చెన్నైలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. మరోవైపు జస్‌ప్రీత్ బుమ్రా పూర్తిగా కోలుకున్నా.. అతని విషయంలో టీమ్‌మేనేజ్‌మెంట్ ఆచితూచి వ్యవహరిస్తోంది. భవిష్యత్తులో కీలక టెస్ట్ టెస్ట్ సిరీస్‌లు ఉన్న నేపథ్యంలో అఫ్గాన్‌తో టీ20 సిరీస్‌కు బుమ్రాను దూరంగా ఉంచే అవకాశాలు ఉన్నాయి. 'అఫ్గానిస్థాన్‌తో టీ20 సిరీస్ కోసం జట్టు ఎంపికపై సెలెక్షన్ కమిటీ ఫోకస్ పెట్టింది. గాయాల నుంచి కోలుకొని ఫిట్‌నెస్ సాధించే ఆటగాళ్లను పరిగణనలోకి తీసుకుంటారు. నితీష్ కుమార్ రెడ్డి, హార్దిక్ పాండ్యా చాలా రోజుల నుంచి సీఓఈలో రిహాబిలిటేషన్ తీసుకుంటున్నారు. వ్యక్తిగత కమిట్‌మెంట్స్ కోసం అప్పుడప్పుడు బయటకు వెళ్లినా ఎక్కువ సమయం సీఓఈలోనే గడిపారు. హార్దిక్ పాండ్యా అయితే బెంగళూరులోనే స్థిరపడ్డాడు. సుందర్ కూడా ఫిట్‌నెస్ నిరూపించుకుంటే సెలెక్షన్స్‌కు అందుబాటులోకి వస్తాడు.'అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్యా పేరును కూడా సెలెక్టర్లు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. బ్యాటింగ్ సామర్థ్యంతో పాటు టీ20 ఫార్మాట్‌కు తగ్గట్లు బౌలింగ్ చేసే కృనాల్‌ను టీమిండియాలోకి తీసుకోవాలని సెలెక్టర్లు భావిస్తున్నారని వార్తలు వస్తున్నాయి. టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ తన స్థానాన్ని నిలబెట్టుకోనున్నాడు. అఫ్గాన్‌తో భారత టీ20 జట్టు(అంచనా) వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, శ్రేయస్ అయ్యర్(కెప్టెన్), ఇషాన్ కిషన్, తిలక్ వర్మ(వైస్ కెప్టెన్), శివమ్ దూబే, సూర్యాన్ష్ షెడ్గే, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణ, ప్రిన్స్ యాదవ్/గుర్నూర్ బ్రార్, కృనాల్ పాండ్యా/వాషింగ్టన్ సుందర్, యశ్ ఠాకూర్, ప్రసిధ్ కృష్ణ.




# తొలి రౌండ్‌లోనే ముగిసిన జకోవిచ్ ప్రయాణం

తీవ్రమైన ఎండ, తేమ, అనారోగ్యం, శారీరక అలసటతో పోరాడిన జకోవిచ్.. అర్జెంటీనా ఆటగాడు మరియానో ??నవోన్‌తో జరిగిన మారథాన్ ఐదు సెట్ల పోరులో 6-7, 7-5, 6-4, 2-6, 1-6 తేడాతో ఓటమిపాలయ్యాడు. ఆర్థర్ యాష్ స్టేడియంలో మ్యాచ్ ఆరంభం నుంచే జకోవిచ్ శారీరకంగా ఇబ్బంది పడుతూ కనిపించాడు. న్యూయార్క్‌లోని తీవ్ర ఉక్కపోత, తేమ వాతావరణం వల్ల తలపై పదే పదే ఐస్ బ్యాగ్ పెట్టుకున్నాడు. వర్షం కారణంగా స్టేడియం రూఫ్ మూసివేసినప్పుడు ఏసీ ఆన్ చేయాలని సూపర్వైజర్‌ను కూడా కోరాడు. మూడో సెట్ ఆరో గేమ్‌లో పరిస్థితి మరింత విషమించి, జకోవిచ్ కోర్టు వెనుకభాగంలో పలుమార్లు వాంతులు చేసుకున్నాడు. టోర్నమెంట్ ఫిజియో అతనికి మాత్రలు అందించగా, కోర్టు పక్కనుంచి సహాయక బృందం ద్రవాలు అందించింది. తొలి సెట్‌ను టైబ్రేక్‌లో 6-7తో కోల్పోయినప్పటికీ, తీవ్రమైన శారీరక ఇబ్బందుల నడుమ జకోవిచ్ అద్భుతంగా పుంజుకున్నాడు. రెండో సెట్‌ను 7-5తో, మూడో సెట్‌ను 6-4తో గెలుచుకుని విజయానికి కేవలం ఒక్క సెట్ దూరంలో నిలిచాడు. అయితే, యువ ఆటగాడు నవోన్ తగ్గకుండా నాలుగో సెట్‌ను 6-2తో గెలిచి మ్యాచ్‌ను నిర్ణయాత్మక ఐదో సెట్‌కు తీసుకెళ్లాడు. ఐదో సెట్‌లో నవోన్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి 4-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. అప్పటికే శరీరం సహకరించక, శక్తి పూర్తిగా క్షీణించడంతో మ్యాచ్ చేజారిపోతోందని గ్రహించిన జకోవిచ్ కోర్టులోనే భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నాడు. గ్యాలరీలో ఉన్న ఆయన భార్య జెలెనా కూడా తీవ్ర ఆందోళనకు గురైంది. నవోన్ ఏమాత్రం తడబడకుండా ఐదో సెట్‌ను 6-1తో ముగించి తన కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని నమోదు చేశాడు. 25వ టైటిల్ కల నిరీక్షణ: మార్గరెట్ కోర్ట్ రికార్డును అధిగమించి 25వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ గెలవాలన్న జకోవిచ్ కల ఈ ఓటమితో ప్రస్తుతానికి ఆగింది. జిమ్మీ కానర్స్ రికార్డు మిస్: యూఎస్ ఓపెన్‌లో జిమ్మీ కానర్స్ పేరిట ఉన్న 98 విజయాల రికార్డును దాటడానికి జకోవిచ్‌కు ఇంకా నాలుగు విజయాలు అవసరమున్న సమయంలో ఈ ఓటమి ఎదురైంది. 18 ఏళ్ల అజేయ రికార్డుకు తెర: గ్రాండ్‌స్లామ్ టోర్నీల తొలి రౌండ్లలో వరుసగా 78 మ్యాచ్‌లు గెలిచిన జకోవిచ్ రికార్డుకు ఈ మ్యాచ్‌తో తెరపడింది. గతంలో 2006 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పాల్ గోల్డ్‌స్టీన్ చేతిలో ఓడిన తర్వాత, మళ్లీ ఇన్నాళ్లకు జకోవిచ్ గ్రాండ్‌స్లామ్ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగాడు.

# అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు మెస్సీ గుడ్‌బై

ఫుట్‌బాల్ ప్రపంచంలో సంచలన నిర్ణయం చోటుచేసుకుంది. అర్జెంటీనా స్టార్ ఆటగాడు లియోనెల్ మెస్సీ అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించారు. ఇకపై అర్జెంటీనా జాతీయ జట్టు తరఫున మైదానంలో కనిపించబోనని ఆయన వెల్లడించారు. ప్రపంచకప్ ఫైనల్‌లో స్పెయిన్‌తో ఓటమి ఎదురైన రెండు రోజుల తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మెస్సీ తెలిపారు. తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా ఈ విషయాన్ని అభిమానులతో పంచుకున్నారు. జాతీయ జట్టుకు దూరమవ్వాలనే నిర్ణయం ఎంతో బాధాకరంగా ఉందని మెస్సీ పేర్కొన్నారు. చాలా కాలంగా ఆలోచించిన అనంతరం ఈ నిర్ణయానికి వచ్చినట్లు చెప్పారు. ఇన్నేళ్లుగా అర్జెంటీనా జెర్సీ కోసం తన శక్తిమేర పోరాడానని, దేశ ప్రజలను సంతోషపెట్టడం, అర్జెంటీనాగా గర్వపడేలా చేయడం తనకు ఎప్పుడూ ముఖ్యమని వివరించారు. మెస్సీ తన ప్రకటనలో.. ఇది తనను తీవ్రంగా కలచివేసిన నిర్ణయమని, ఇప్పటికీ ఆ బాధ తనలో ఉందని తెలిపారు. ఇటీవలి సంవత్సరాల్లో జట్టుతో కలిసి ఎన్నో విజయాలు సాధించినప్పటికీ, అంతకుముందు కాలంలోనూ జాతీయ జట్టు కోసం పూర్తిస్థాయిలో కష్టపడ్డానని గుర్తుచేసుకున్నారు. తన అంతర్జాతీయ కెరీర్‌లో చివరి దశకు చేరుకున్నానని మెస్సీ అభిప్రాయపడ్డారు. కొన్ని అధ్యాయాలు ముగిసే సమయం వచ్చిందని, వాటిలో జాతీయ జట్టు అధ్యాయం ముగియడం తనకు ఎంతో బాధ కలిగిస్తోందన్నారు. అర్జెంటీనా జట్టులో భాగం




కావడాన్ని తాను ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటానని చెప్పారు. తనవంతుగా ఇవ్వాల్సినదంతా ఇచ్చేశానని, ఇక తన స్థానాన్ని కొత్త తరం ఆటగాళ్లకు ఇవ్వాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు. జాతీయ జట్టుకు మద్దతుగా నిలిచిన అభిమానులకు మెస్సీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. 20 ఏళ్లుగా తనపై చూపిన ప్రేమ, మద్దతును ఎప్పటికీ మరచిపోలేనని అన్నారు. ఇకపై స్టేడియం లోపల నుంచి అభిమానుల గొంతులు వినడం మిస్ అవుతానని, అయితే బయట నుంచి అర్జెంటీనా జట్టుకు మద్దతు ఇస్తూ ఉంటానని తెలిపారు. మంచి సమయాల్లోనే కాకుండా, ముఖ్యంగా కష్టకాలంలో జట్టుకు అండగా ఉంటానని చెప్పారు. తన కుటుంబానికి, ఈ ప్రయాణంలో తనతో కలిసి నడిచిన కోచ్‌లు, సహచర ఆటగాళ్లు, అధికారులు, సిబ్బందికి కూడా మెస్సీ ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రయాణం అందమైనదే కాకుండా ఎంతో కఠినమైనదని, అయినప్పటికీ తనకు ఎన్నో మరచిపోలేని జ్ఞాపకాలను అందించిందన్నారు. తన సహచరులతో కలిసి అభిమానులు కలలో కూడా ఊహించని ఎన్నో క్షణాలను సృష్టించగలిగామని మెస్సీ అన్నారు. ఆ అనుభవం తనకు అద్భుతంగా అనిపించిందని పేర్కొంటూ అభిమానులపై తన ప్రేమను వ్యక్తం చేశారు. చివరగా "అర్జెంటీనావాడిగా పుట్టించినందుకు దేవుడికి కృతజ్ఞతలు" అంటూ భావోద్వేగ సందేశాన్ని ఇచ్చారు. అనంతరం "లెట్స్ గో, అర్జెంటీనా!" అంటూ తన ప్రకటనను ముగించారు.


# ఇంగ్లండ్ పర్యటనలో పాకిస్థాన్ పేలవ ప్రదర్శన

ఇంగ్లండ్ పర్యటనలో పాకిస్థాన్ పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. మూడు టెస్ట్‌ల సిరీస్ కోసం ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లిన పాకిస్థాన్ వరుసగా రెండు మ్యాచ్‌ల్లోనూ ఘోర పరాజయాలను మూటగట్టుకుంది. ఇంగ్లండ్‌కు కనీస పోటీ ఇవ్వలేకపోయింది. తొలి టెస్ట్‌లో ఇన్నింగ్స్ 103 పరుగుల తేడాతో చిత్తయిన పాకిస్థాన్.. తాజాగా లార్డ్స్ టెస్ట్‌లో 194 పరుగుల తేడాతో ఓటమిపాలైంది.దాంతో మూడు టెస్ట్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 0-2తో కోల్పోయింది. ఈ పరాజయంతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ) పాయింట్స్ టేబుల్‌లో అట్టడుగు స్థానంలో నిలిచింది. పాకిస్థాన్‌తో పాటు ఇంగ్లండ్ కూడా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరలేని పరిస్థితి నెలకొంది. ఈ పరాజయంపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. మహమ్మద్ రిజ్వాన్‌తో పాటు ఇమామ్ ఉల్ హక్‌ను జట్టు నుంచి తప్పించి పాకిస్థాన్‌కు పంపించాలని నిర్ణయించిందని జియో న్యూస్ పేర్కొంది. ఈ వరుస పరాజయాల నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు హైలెవెల్ మీటింగ్ నిర్వహించిందని కూడా తెలిపింది. ఈ సమావేశంలో పీసీబీ ఛైర్మన్ మోహసిన్ నఖ్వీ, సీఓఓ సుమైర్ అహ్మద్, పీఎస్ఎల్ సీఈఓ సల్మాన్ నజీర్, సీనియర్ సెలెక్టర్ అకీబ్ జావెద్, పరిమిత ఓవర్ల హెడ్ కోచ్ మైక్ హెస్సెన్ హాజరయ్యారని పేర్కొంది. ఇమ్రాన్ ఖాన్ కుమారుల ఇంటర్వ్యూ కంటే పాకిస్థాన్ ఘోర పరాజయాలే తీవ్ర అసంతృప్తికి గురి చేశాయని పీసీబీ




ఛైర్మెన్ అన్నట్లు బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. 'రెండో టెస్టు సందర్భంగా స్కై స్పోర్ట్స్‌లో ఇమ్రాన్ ఖాన్ కుమారుల ఇంటర్వ్యూ ప్రసారం కావడం కూడా అధికార వర్గాలను కలవరపెట్టింది. కానీ అన్నింటికన్నా ఎక్కువగా.. మీడియాలో పాకిస్తాన్ జట్టును చిత్రీకరించిన తీరు, వారి ప్రదర్శనే ఆందోళన కలిగించాయి. ఇమామ్ తీవ్ర చిక్కుల్లో ఉన్నాడు. అతని స్థానంలో అబ్దుల్లా ఫజల్ జట్టులో చేరుతాడు.'అని ఓ పీసీబీ అధికారి తెలిపాడు. ఈ వరుస పరాజయాల నేపథ్యంలో పాకిస్థాన్ టెస్ట్ టీమ్ హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్‌ను తప్పించాలనే యోచనలో పీసబీ ఉన్నట్లు తెలుస్తోంది. సర్ఫరాజ్ అహ్మద్ స్థానంలో పరిమిత ఓవర్ల కోచ్ మైక్ హెస్సేన్‌కే టెస్ట్ టీమ్ బాధ్యతలు కూడా అప్పగించనున్నారని ప్రచారం జరుగుతోంది. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగే మూడో టెస్ట్‌కు ముందే ఈ నిర్ణయం వెలువడనుందని జియో న్యూస్ పేర్కొంది.

# ఆసియా కప్: థాయిలాండ్‌పై భారత్ ఘన విజయం




**హైదరాబాద్ :** మహిళల టీ20 ఆసియా కప్‌లో భారత జట్టు ఘన విజయం సాధించి టోర్నీని ఘనంగా ప్రారంభించింది. థాయ్‌లాండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో టీమిండియా 94 పరుగుల భారీ తేడాతో విజయం నమోదు చేసింది. దుబాయ్‌లో జరిగిన ఈ పోరులో ఓపెనర్ షఫాలీ వర్మ మెరుపు అర్ధశతకంతో సత్తా చాటగా, బౌలర్లు సమష్టిగా రాణించి భారత్‌కు తిరుగులేని విజయాన్ని అందించారు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేపట్టిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ కేవలం 36 బంతుల్లోనే 8 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 64 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది.ఈ మ్యాచ్‌తోనే టీ20ల్లోకి అరంగేట్రం చేసిన ప్రతీక రావల్ 18 బంతుల్లో 2 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 22 పరుగులు చేసి రాణించింది. థాయ్‌లాండ్ బౌలర్లలో లావోమి 3 వికెట్లు పడగొట్టగా, సునిద 2 వికెట్లు తీసింది. అనంతరం 160 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన థాయ్‌లాండ్, భారత బౌలర్ల ధాటికి తలవంచింది. ఆ జట్టు 16.1 ఓవర్లలో కేవలం 65 పరుగులకే కుప్పకూలింది. థాయ్‌లాండ్ బ్యాటర్లలో కొంచరోయెంకాయ్ (41) మాత్రమే ఒంటరి పోరాటం చేయగా, మిగతా వారెవరూ కనీస పోరాట పటిమ కనబరచలేకపోయారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# కిరణ్ అబ్బవరం మూవీ హతః




యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటుడిగానే కాకుండా నిర్మాతగానూ తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇటీవల దాదాపు 50 మంది కొత్తవాళ్లతో తెరకెక్కిన విలేజ్ డ్రామా 'తిమ్మరాజుపల్లి టీవీ' తో నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టిన కిరణ్.. ఇప్పుడు తన బ్యానర్ నుంచి రెండో ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సిద్ధమయ్యారు. ఈ కొత్త సినిమాకు 'హతః' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు.'హతః' టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను మేకర్స్ చాలా విభిన్నంగా రూపొందించారు. వీడియో ప్రారంభంలో ఒక చీకటి వాతావరణం కనిపించగా.. ఆ తర్వాత కెమెరా ఒక డార్క్ బాక్స్ వైపు జూమ్ అవుతుంది. ఆ బాక్స్‌లో ఒక పిల్లి కనిపిస్తుంది. చివర్లో 'హతః' అనే టైటిల్‌ను రివీల్ చేశారు. అయితే అసలు ట్విస్ట్ అక్కడే ఉంది. ఈజ్ ద క్యాట్ అలైవ్ ఆర్... అంటూ మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్ సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచింది. పిల్లి బతికే ఉందా? లేదా? అనే ప్రశ్నతోనే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించే ప్రయత్నం చేశారు. సినిమా కథ, జానర్, పాత్రలు వంటి విషయాలను ప్రస్తుతానికి పూర్తిగా రహస్యంగా ఉంచారు. 'హతః' గురించి మేకర్స్ చెబుతున్న మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఇప్పటివరకు ప్రేక్షకులు చూడని తరహా కథతో ఈ సినిమా రూపొందుతోందట. సాధారణ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా, కొత్త జానర్‌లో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. టైటిల్‌తో పాటు గ్లింప్స్, క్యాప్షన్‌లోనూ మిస్టరీని కొనసాగించడంతో అసలు సినిమా ఏ జానర్‌కు చెందింది? కథ ఏంటి? అనే ప్రశ్నలు మొదలయ్యాయి. ముఖ్యంగా ఒక్క పిల్లిని ప్రధానంగా చూపిస్తూ టైటిల్‌ను ప్రకటించడం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీస్తోంది. 'తిమ్మరాజుపల్లి టీవీ' తర్వాత కిరణ్ అబ్బవరం నిర్మాణంలో వస్తున్న రెండో ప్రాజెక్ట్ ఇది. కిరణ్ అబ్బవరం, పౌర్ణమి ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమాకు అనుష్ గోరాక్ రచన, దర్శకత్వంతో పాటు సినిమాటోగ్రఫీ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ చిత్రంలో కుష్లు మద్దాల, రెహ్మాన్, నమ్రిత ఎంవీ, తనూజ పుట్టస్వామి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జెసిన్ జార్జ్ సంగీతం అందిస్తుండగా, అఖిల్ చక్రవర్తి ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం 'హతః' చిత్రానికి సంబంధించిన షూటింగ్, కథ, పాత్రలు, విడుదల తేదీ వంటి వివరాలను మేకర్స్ సస్పెన్స్‌లోనే ఉంచారు. టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌తోనే సినిమాపై ఆసక్తిని పెంచిన చిత్రబృందం.. త్వరలోనే మరిన్ని అప్డేట్స్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

# క్యాన్సర్ పుకార్లను తోసిపుచ్చిన నటి ప్రేమ

## సరైన జోడీ కుదిరితే రెండో పెళ్లికి ఓకే




దక్షిణాది సినీ పరిశ్రమలో ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన సీనియర్ నటి ప్రేమ.. తన వ్యక్తిగత జీవితంపై వచ్చిన పలు రూమర్లకు తాజాగా చెక్ పెట్టారు. ముఖ్యంగా తనకు క్యాన్సర్ వచ్చిందంటూ గతంలో జరిగిన ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో తన రెండో వివాహంపై వస్తున్న వార్తలపైనా ఆమె ఆసక్తికరంగా స్పందించారు. జీవితాంతం తనకు తోడుగా ఉండే సరైన వ్యక్తి దొరికితే వయసుతో సంబంధం లేకుండా పెళ్లి చేసుకోవడానికి సిద్ధమేనని ఆమె పేర్కొన్నారు. కాగా, తెలుగు, కన్నడ చిత్ర పరిశ్రమల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రేమ.. వెంకటేష్ సరసన నటించిన 'ధర్మచక్రం', కోడి రామకృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన 'దేవి' వంటి సినిమాల తో తెలుగు ప్రేక్షకులకు ఎంతో దగ్గరయ్యారు. గతంలో తనకు క్యాన్సర్ సోకిందంటూ కొన్ని వార్తలు ప్రచారంలోకి రావడంపై ప్రేమ తీవ్రంగా స్పందించారు. తాను న్యూజిలాండ్‌కు స్నేహితురాలిని కలవడానికి వెళ్లిన సమయంలో ఈ పుకార్లు వ్యాపించాయని తెలిపారు.క్యాన్సర్‌తో పోరాడి విజయం సాధించిన సోనాలి బింద్రే, మమతా మోహన్‌దాస్, గౌతమి వంటి నటీమణులను ఆమె గుర్తుచేసుకున్నారు. అయితే తనకు మాత్రం అలాంటి అనారోగ్య సమస్య ఏదీ లేదని స్పష్టం చేశారు. దేవుడి దయతో తాను సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నానని తెలిపారు. తన గురించి ఇలాంటి తప్పుడు వార్తలు రావడం బాధ కలిగించిందని చెప్పిన ప్రేమ.. ఆ సమయంలో తల్లిదండ్రుల అండ తనకు ఎంతో మానసిక బలాన్ని ఇచ్చిందని వెల్లడించారు. ప్రేమ వ్యక్తిగత జీవితంలో 2006లో వ్యాపారవేత్త జీవన్ అప్పాచ్చును వివాహం చేసుకున్నారు. అయితే కుటుంబ విభేదాల కారణంగా 2016లో వీరిద్దరూ చట్టబద్ధంగా విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి ప్రేమ ఒంటరిగా ఉంటున్నారు. ఇటీవల ఆమె రెండో పెళ్లి చేసుకోబోతు న్నారంటూ వార్తలు రావడంతో ఈ అంశంపై కూడా ఆమె స్పందించారు. పెళ్లి అనేది పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయమని స్పష్టం చేశారు.

# 200 కోట్ల వైపు ఇరుముడి దూకుడు

## ఇరుముడి కట్టు వీడగియో సాంగ్ విడుదల చేసిన మేకర్స్

మాస్ మహారాజా రవితేజకు మరో బ్లాక్‌బస్టర్ హిట్ దక్కింది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించిన 'ఇరుముడి' సినిమా బాక్సాఫీస్ వద్ద అంచనాలకు మించి దూసుకెళ్తోంది. విడుదలైనప్పటి నుంచి ప్రేక్షకుల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందనతో ఈ సినిమా వరల్డ్‌వైడ్‌గా ఇప్పటికే రూ.150 కోట్ల గ్రాస్ మార్క్‌ను దాటింది. ప్రస్తుతం అదే జోరును కొనసాగిస్తూ మరో భారీ మైలురాయిని అందుకునే దిశగా పరుగులు పెడుతోంది. 'ఇరుముడి' సినిమాకు ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్‌కు తాజా టికెట్ సేల్స్‌నే నిదర్శనంగా చెప్పొచ్చు. ప్రముఖ ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్స్ బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ ద్వారా ఇప్పటివరకు ఈ సినిమా 70 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. ఒక ప్రాంతీయ సినిమా ఈ స్థాయిలో టికెట్లను విక్రయించడం అరుదైన విషయంగా ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. 'ఇరుముడి' ఇప్పుడు రూ.200 కోట్ల వరల్డ్‌వైడ్ గ్రాస్ దిశగా అడుగులు వేస్తోంది. ఇకపోతే రవితేజ మాస్ ఇమేజ్‌కు తగ్గ కమర్షియల్ అంశాలతో పాటు కథకు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఇవ్వడం 'ఇరుముడి' విజయానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా చెబుతున్నారు. దర్శకుడు శివ నిర్వాణ తనదైన శైలిలో కథను తెరకెక్కించడంతో ప్రేక్షకులు సినిమాతో కనెక్ట్ అవుతున్నారని చిత్ర బృందం భావిస్తోంది. రవితేజ తన పాత్రలో మాస్ ఎనర్జీతో పాటు భావోద్వేగాలను కూడా బలంగా పండించారని అభిమానులు ప్రశంసిస్తున్నారు. సినిమాలోని కీలక సన్నివేశాలు ప్రేక్షకులను కదిలి స్తున్నాయని, ముఖ్యంగా క్లైమాక్స్ ఎమోషనల్ సీన్స్‌కు థియేటర్లలో మంచి స్పందన వస్తుంది. అయ్యప్ప స్వామి భక్తి, తండ్రీకూతుళ్ల మధ్య ఉండే ఆత్మీయ అనుబంధాన్ని ప్రధానంగా తీసుకుని ఈ సినిమాను రూపొందించారు. ఇక ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమా నుంచి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న కీలకమైన 'ఇరుముడి కట్టు' వీడియో సాంగ్‌ని మేకర్స్ ఘనంగా విడుదల చేశారు. 'కట్టు కట్టు ఇరుముడి కట్టు' అంటూ సాగే ఈ గీతం విడుదలైన వెంటనే యూట్యూబ్‌తో పాటు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ ఈ పాటకు అందించిన ట్యూన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హై-వోల్టేజ్ భక్తి సంగీతం, అయ్యప్ప మాలధారుల నృత్యాలు, 'స్వామియే శరణమయ్యప్ప' అనే నామస్మరణతో సాగుతున్న ఈ గీతం శ్రోతలను ఆకట్టుకుంటోంది. పాటను వింటున్న సమయంలోనే భక్తిభావం కలిగేలా మ్యూజిక్‌ను కంపోజ్ చేసిన తీరు ప్రశంసలు అందుకుంటోంది. ముఖ్యంగా మాలధారుల డ్యాన్స్ మూమెంట్స్, ఎనర్జిటిక్ బీట్స్ పాటకు మరింత జోష్‌ను తీసుకొచ్చాయి. సోషల్ మీడియాలో ఈ పాటకు సంబంధించిన వీడియోలు, రీల్స్ వైరల్ అవుతున్నాయి. 'ఇరుముడి'లో ఈ పాటతో పాటు 'విల్లాలి వీరుడు', 'మ్లలెపూల పల్లకి' వంటి భక్తి గీతాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.






# షూటింగ్ సెట్‌లోకి అడుగుపెట్టిన రష్మిక

షూటింగ్‌లో గాయపడిన నటి రష్మిక కోలుకున్నారు. తిరిగి సెట్స్‌లోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఇంట్లో విశ్రాంతి తీసుకున్న రోజులను గుర్తుచేసుకుంటూ ఓ పోస్ట్ పెట్టారు. 'తిరిగి షూట్‌కు వెళ్తున్నా. కానీ, ఈ క్షణాలను మాత్రం కచ్చితంగా మిస్ అవుతాను' అంటూ వరలక్ష్మి వ్రతం చేస్తోన్న ఫొటోలతో పాటు.. ఇంట్లో తాను ఆడుకున్న పజిల్ చిత్రాలను షేర్ చేశారు. ఎట్టకేలకు రష్మిక తిరిగి సెట్‌లోకి వెళ్లడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. ఆమెకు జాగ్రత్తలు చెబుతూ.. 'క్వీన్ ఈజ్ బ్యాక్' అంటూ నెట్టింట కామెంట్స్ చేస్తున్నారు. 'మైసా' చిత్రీకరణ సమయంలో రష్మిక గాయపడ్డారు. షూటింగ్‌లో భాగంగా ఓ పాటకు డ్యాన్స్ చేస్తుండగా తుంటి భాగంలో బలమైన గాయమైంది. ఆరు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో రష్మిక ఇంట్లో ఉండి తరచూ తన హెల్త్ అప్‌డేట్‌లతో పాటు, తాను చేస్తోన్న పనులను అభిమానులతో పంచుకుంటూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నారు.

---------




# రోమాంచకం ట్రైలర్ కు అదిరిపోయే రెస్పాన్స్

'యానిమల్', 'అర్జున్ రెడ్డి' వంటి ఇంటెన్స్, వయొలెంట్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పణలో, ఆయన సొంత నిర్మాణ సంస్థ భద్రకాళి పిక్చర్స్ నుంచి ఓ యూత్‌ఫుల్ రొమాంటిక్ కామెడీ వస్తుండటం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇందులో యువ నటుడు సుమంత్ ప్రభాస్ హీరోగా నటిస్తున్నాడు. ఈ నేపథ్యంలో, 'రోమాంచకం' మూవీ ట్రైలర్ ఇటీవలే విడుదలైంది. ఊహించినట్టుగానే, ఈ ట్రైలర్‌కు ప్రేక్షకులు, నెటిజన్ల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. సందీప్ వంగా బ్రాండ్‌కు పూర్తి భిన్నంగా, ఆహ్లాదకరమైన వినోదంతో ట్రైలర్ ఉండటంతో సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ అయింది.

'మేమ్ ఫేమస్' చిత్రంతో యువతలో మంచి గుర్తింపు తెచ్చుకున్న సుమంత్ ప్రభాస్ సరసన అనంతిక సనిల్‌కుమార్ హీరోయిన్‌గా నటిస్తోంది. వేణుగోపాల్ రెడ్డి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ట్రైలర్ చూస్తుంటే ఇదొక కలర్‌ఫుల్, ఎనర్జిటిక్ రొమాంటిక్ కామెడీ అని స్పష్టమవుతోంది. డేటింగ్ యాప్ స్టార్టప్ నడిపే హీరో, తన వ్యాపారం కోసం చేసే పరిశోధనలో భాగంగా చెన్నైకి చెందిన హీరోయిన్‌తో ప్రేమలో పడతాడు. ఆ తర్వాత అతని స్నేహితుల గ్యాంగ్‌తో కలిసి చేసే పనులు కొన్ని అనూహ్య సంఘటనలకు దారితీస్తాయి. ఈ క్రమంలో వచ్చే కామెడీ, సంఘర్షణలు ఆసక్తికరంగా ఉన్నాయి.

"రాస్తే రామాయణం... తీస్తే రోమాంచకం" అంటూ హీరో చెప్పే డైలాగ్ ట్రైలర్‌కే హైలైట్‌గా నిలిచింది. నిర్మాణ విలువలు ఉన్నతంగా ఉండటంతో పాటు, నేపథ్య సంగీతం కూడా చాలా క్యాచీగా ఆకట్టుకుంటోంది. హింసకు తావు లేకుండా, యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులను కూడా అలరించేలా ఒక క్లీన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. మొత్తం మీద, ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచడంలో పూర్తిగా సక్సెస్ అయింది. ఈ చిత్రం 2026 సెప్టెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# శ్రీవిష్ణు కొత్త మూవీ ప్రారంభం

వైవిధ్యమైన కథలు, వినోదాత్మక చిత్రాలతో ప్రేక్షకులను అలరించే కథానాయకుడు శ్రీవిష్ణు. ఇప్పుడాయన మరో ఆసక్తికరమైన కథను ప్రేక్షకులకు అందించేందుకు సిద్ధమయ్యారు. సన్నీ సంజయ్ దర్శకత్వంలో శ్రీవిష్ణు నటిస్తున్న కొత్త సినిమా ప్రకటన వచ్చింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై హారిక సూర్యదేవర నిర్మిస్తున్న కొత్త మూవీ షూటింగ్ సోమవారం మొదలైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం గ్లింప్స్‌ను పంచుకుంది. 'ఇది మనందరి కథ. అందిలాగే నా కథ' అంటూ శ్రీ విష్ణు తన కథను చెబుతున్న విధానం అలరిస్తోంది. 'మరుగేలరా.. ఓ రాఘవ' అంటూ నేపథ్యంలో త్యాగరాజ కృతి వినిపించారు.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613